
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 28 జూన్ 2025





జననాథుడై..

కోలాహలంగా విజయవాడ జగన్నాథస్వామి రథయాత్ర

విద్యాధరపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం ఘనంగా జరిగింది. ఇస్కాన్ ఆధ్వర్యంలో విద్యాధరపురం లేబర్‌కాలనీ గ్రౌండ్ వద్ద నిర్వహించిన ఈ రథయాత్రకు ముందు కళాబృందాలు, దేశ, విదేశీ భక్తులు ఆనందోత్సాహాలతో కదలగా, యాత్ర స్వాతిరోడ్డు, శివాలయం సెంటర్, కుమ్మరిపాలెం సెంటర్, వన్‌టౌన్ రథం సెంటర్ మీదుగా సీతమ్మవారి పాదాల వరకూ చేరింది. ఎమ్మెల్యే సుజనా చౌదరి, లైలా గ్రూపు సీఈవో గోకరాజు గంగరాజు ముఖ్య అతిథులుగా విచ్చేసి జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర ఆశీనులైన రథాన్ని ప్రారంభించారు. రథం ముందు ప్రాంతాన్ని బంగారం, వెండి చీపుర్లతో శుభ్రపరిచారు. అనంతరం స్వామివారికి ధూపదీప హారతులిచ్చి, 108 రకాల పిండివంటలతో భోగం సమర్పించారు. ఈ రథయాత్రకు అడుగడుగునా భక్తులు నీరాజనాలు పట్టగా, నిర్వాహకులు ప్రసాద వితరణ చేశారు.

మచిలీపట్నంలోని జడ్పీ కార్యాలయం



బదిలీ వార్

జడ్పీ చైర్‌పర్సన్ వర్సెస్ సీఈవో

- ఇష్టానుసారంగా జరిగిన ఉద్యోగుల బదిలీలు
- బదిలీ అయినా రిలీవ్ కాని వారెందరో..!
- సస్పెండైన వారికి పోస్టింగ్.. మొదలైన విభేదాలు
- ముడుపులు భారీగా అందాయన్న ఆరోపణలు
- సంతకాలు చేయనంటున్న చైర్‌పర్సన్

జిల్లా పరిషత్‌లో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోందా? ఈ ప్రభావం ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీలపై పడిందా? నేరుగా బదిలీలు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కౌన్సెలింగ్ పద్ధతిలోనే జరగాలని జడ్పీ సీఈవో పట్టుబట్టిన నేపథ్యంలో వార్ మొదలైందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో విభేదాల నడుమ ఈనెల 9న 104 మంది ఉద్యోగుల బదిలీలు జరిగాయి. వీరిలో ఎంపీడీవోలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర విభాగాల ఉద్యోగులు ఉన్నారు. బదిలీలు జరిగినా, వారిలో చాలామంది ఇంతవరకు రిలీవ్ కాలేదు. కౌన్సెలింగ్‌కు ముందే మిగతా 6లో..

అజ్ఞాతం వీడి..

గుడివాడకు వచ్చిన వైసీపీ నేత కొడాలి నాని

- అనారోగ్యంపై ఇన్నాళ్ల ప్రచారం ఉత్తుత్తిదేనా?
- గుండె వ్యాధి, పరిస్థితి విషమమని ప్రచారం
- కానీ, హుషారుగానే వచ్చిన మాజీమంత్రి
- గుడివాడ కోర్టు వద్ద నాయకులతో హడావిడి
- కార్యకర్తలతో ఉత్సాహంగానే సెల్ఫీలు
- **అరెస్టు నుంచి తప్పుకొనేందుకే అతి ప్రచారమా?**

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అనారోగ్య కారణాలంటూ గుడివాడకు కొంత కాలం నుంచి దూరంగా ఉంటున్న మాజీమంత్రి, వైసీపీ నేత కొడాలి నాని శుక్రవారం ఒక్కసారిగా ప్రత్యక్షమయ్యారు. నాని ఆరోగ్యం విషమంగా ఉందని, హార్ట్‌రేట్ సగానికి సగం పడిపోయిందంటూ వైసీపీ మిగతా 6లో..



గుడివాడ కోర్టు వద్ద వైసీపీ కార్యకర్తలతో ఉత్సాహంగా మాజీమంత్రి కొడాలి నాని

పోలీసులు అలెర్ట్

కొడాలి నాని గుడివాడకు రావటంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. తొలుత ఆయన ఇంటికి చేరుకుని, ఆ తర్వాత కోర్టుకు వెళ్లడంతో ఆయన కదలికలపై నిఘా పెట్టారు. కొడాలి నాని, ఆయన అనుచరులపై ఉన్న కేసుల దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు రావి వెంకటేశ్వరరావు వస్త్ర దుకాణంపై దాడికి పాల్పడ్డారన్న కేసులో పోలీసులు విచారణ చేపట్టడంతో కొడాలి నాని హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేశారు. స్థానిక కోర్టులో వేయాలని హైకోర్టు సూచించటంతో ఆయన శుక్రవారం గుడివాడ వచ్చారు.

అంతా పెద్దవారే!

సాధారణంగా అధిక వడ్డీకి ఆశపడి సామాన్యులు మోసపోతుంటారు. కానీ, రూ.300 కోట్లకు ఎగనామం పెట్టిన అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పెట్టుబడి పెట్టిన వారంతా ప్రభుత్వ అధికారులు, పోలీసులు, వైద్యులేనంటే నమ్ముతారా? కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాలకు చెందిన రాజకీయ నాయకులు సైతం కనీసం ఆ కంపెనీ వివరాలు తెలుసుకోకుండా పెట్టుబడి పెట్టి మోసపోయిన ఉదంతాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి.

'అద్విక'లో పెట్టుబడులు పెట్టినవారంతా ప్రముఖులే..

ప్రభుత్వ అధికారులు, రాజకీయ నేతలే ఎక్కువ

లిస్టులో పోలీసులు, వైద్యులు కూడా..

- కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాలవారు
- ట్రేడింగ్ కంపెనీ, పీఎస్‌కు బాధితుల క్యూ
- అధిక వడ్డీ ఆశచూపి ఆకర్షించిన ఎండీ ఆదిత్య
- 1,200 మంది ఖాతాదారులు.. రూ.300 కోట్ల పెట్టుబడి
- బోర్డు తిప్పేయడంతో లబోదిబోమంటున్న బాధితులు
- సొమ్మంతా హవాలాలో దుబాయి చేరినట్టు గుర్తింపు
- ల్యాప్‌టాప్‌లో బయటపడిన ఆదిత్య రాసలీలలు

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రూ.లక్ష పెట్టుబడి పెడితే, నెలకు రూ.6 వేలను వడ్డీగా చెల్లిస్తామని చెప్పి ఏజెంట్లు, ఖాతాదారులకు ఝలక్ ఇచ్చిన విజయవాడలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్యతో పాటు కిరణ్ అనే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. అయితే, ఆదిత్య చేసిన లీలలు మిగతా 6లో..



విజయవాడలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం



ఏజెంట్లతో మాట్లాడుతున్న ఆదిత్య (పచ్చచొక్కా)

మార్గం సుగమం

చింతలమడ, లంకతోట రహదారులకు వీడిన గ్రహణం

- **2018లోనే టీడీపీ ప్రభుత్వంలో నిర్మాణాలకు శంకుస్థాపన**
- **వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయిన పనులు**
- **తాజాగా కూటమి ప్రభుత్వం నిధులివ్వడంతో త్వరలో పనులు ప్రారంభం**

(ఆంధ్రజ్యోతి-చల్లపల్లి) : చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు చింతలమడ, పాగోలు శివారు లంకతోట రహదారులకు గ్రహణం వీడింది. ఇక్కడి ప్రజల చిరకాల కోరికగా, రైతాంగానికి సౌకర్యవంతంగా ఉండే ఈ రహదారుల నిర్మాణానికి 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏఐఐబీ నిధులు మంజూరుచేసి నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. 2019 ఎన్నికల్లో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి రావటంతో అభివృద్ధి నిలిచిపోయింది. అనేక రహదారుల నిర్మాణాలను రద్దుచేసిన వైసీపీ ప్రభుత్వం ఏఐఐబీ నిధులు కావటంతో చింతలమడ, లంకతోట పనులను మాత్రం రద్దు చేయలేకపోయింది. ఆలస్యంగా పనులు ప్రారంభించినా పనులు పూర్తిచేయలేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఈ ఇబ్బందులను గమనించిన కూటమి ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మళ్లీ నిధుల మంజూరుకు సహకరించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.





అధ్వానంగా ఉన్న లంకతోట రహదారి (ఇన్‌సెట్‌లో) చింతలమడ రోడ్డులో శ్లాబ్ కల్వర్టు ప్రదేశంలో మొక్కలు

వైసీపీ హయాంలో..

2018లో నాటి టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో ఈ రహదారులకు నిధులు మంజూరయ్యాయి. లక్ష్మీపురం మిగతా 6లో..



ప్రగతి పథాన కేడీసీసీబీ సేవలు

- 20 శాతం వృద్ధిరేటు దిశగా ప్రణాళికలు
- రైతులకు ఏటా రూ.2 వేల కోట్ల కొత్త రుణాలు
- మహజన సభలో చైర్మన్ నెట్టెం రఘురాం

6



దుర్గమ్మకు అన్నవరం నుంచి సారె



మహాజనసభలో మాట్లాడుతున్న చైర్మన్ నెట్టెం రఘురాం

ప్రగతి పథాన కేడీసీసీబీ సేవలు

- 20 శాతం వృద్ధిరేటు దిశగా ప్రణాళికలు
- రైతులకు ఏటా రూ.2వేల కోట్ల కొత్త రుణాలు
- బ్యాంకు ఖాతాదారులకు యుపీఐ సేవలు ప్రారంభం
- మహాజన సభలో చైర్మన్ నెట్టెం రఘురాం

మచిలీపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు(కేడీసీసీ)ను ప్రగతిపథంలో నడిపిస్తానని చైర్మన్ నెట్టెం రఘురాం తెలిపారు. శుక్రవారం మచిలీపట్నం బ్యాంకు కార్యాలయంలో జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. 110 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక బ్యాంకుకు తనను చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా రైతులు, డ్వాక్రా మహిళలు, చేనేత, మత్స్య కార్మికులు, ఉద్యోగులకు వారి అవసరం, అర్హత ఆధారంగా రుణాలు మంజూరుచేస్తామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.11,302 కోట్ల వ్యాపారం జరిగిందని, 2025-26 సంవత్సరంలో రూ.13500 కోట్లకు అధిగమించేలా(20శాతం వృద్ధి రేటుతో) ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్టు ఆయన చెప్పారు. 2026 మార్చి మాసాంతానికి డ్వాక్రా మహిళలకు రూ.700 కోట్లు రుణాల మంజూరు లక్ష్యంగా నిర్దేశించుకున్నామనీ, ఇందుకోసం 7500గా ఉన్న డ్వాక్రా సంఘాలను 10వేలకు పెంచి అన్ని గ్రూపులకు రూ.20 లక్షల రుణాలు మంజూరుచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా రైతాంగానికి వ్యవసాయ అవసరాలకోసం ప్రతీఏటా రెండువేల కోట్లు కొత్తగా రుణాలు ఇచ్చే ప్రణాళిక చేస్తున్నామని, వ్యవసాయేతర రుణాలు రూ.100 కోట్లు మంజూరు చేయనున్నట్టు వివరించారు. సీఈవో ఎ.శ్యాం మనోహర్ మాట్లాడుతూ, బ్యాంకు యూపీఐ సేవలను ప్రారంభించటం జరిగిందని, బ్యాంకు ఖాతాలను ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలకు లింక్ చేసుకోవచ్చని, చిరు వ్యాపారులు క్యూఆర్ కోడ్ ద్వారా వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవచ్చన్నారు. ఈ-స్టాంపింగ్ వ్యాపారాన్ని త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా డీసీవో చంద్రశేఖర్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా డీసీవో శ్రీనివాసరెడ్డి, ఆప్కాబ్ జీఎం పి.ఎస్.మణి, జీఎం చంద్రశేఖర్, జీఎం రంగబాబు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం ఇస్తున్న డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘ నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పోస్టుమెట్రిక్ కోర్సుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని శుక్రవారం కలెక్టర్ బాలాజీకి రాష్ట్ర డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. 2024-25 విద్యా సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అందలేదన్నారు. దీనివల్ల లెక్చరర్ల జీతాలు, అద్దె, కరెంటు బిల్లులు తదితర చెల్లింపులకు ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తోందని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యలమంచిలి శివనాగేంద్రప్రసాద్, పెమ్మసాని రమేష్, ఎ.జగదీష్, రాజశేఖర్, సీహెచ్ వెంకటస్వామి తదితరులు ఉన్నారు.



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ గంగాధరరావు, హాజరైన మహిళా కానిస్టేబుళ్లు

పారదర్శకంగా మహిళా పోలీసుల బదిలీలు

- ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు శుక్రవారం బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ర్యాంకుల ఆధారంగా మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు, స్పౌజ్ కోటాలు, దివ్యాంగుల కోటా, ఆరోగ్యపరమైన సమస్యల ప్రాతిపదికగా బదిలీలు చేశారు. 400 మంది మహిళా పోలీసులు దరఖాస్తు చేసుకోగా వారు కోరుకున్న విధంగా బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ, తుది జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపుతామన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఏఎస్పీ అడ్మిన్ వీవీ నాయుడు, ఏఆర్ ఏఎస్పీ బి.సత్యనారాయణ, ఏవో సుబ్రహ్మణ్యం, అంగన్న, ఎస్‌బి సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నాట్య ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

కూచిపూడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించిన నాట్య ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు ఈ పరీక్షలు జరుగనున్నాయి. 35 మంది విద్యార్థులకుగాను 29 మంది నాట్య విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల అధికారిగా సుధీర్ రావు, చీఫ్ సూరింటెండెంట్‌గా చింతా రవిబాలకృష్ణ వ్యవహరించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుడివాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ మహబూబ్ షరీఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కైకలూరు నుంచి మండవల్లి మధ్య రైల్వే ట్రాక్‌ను దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తి కైకలూరు నుంచి వస్తున్న గూడ్స్‌రైలు ఢీకొని మృతిచెందినట్టు తెలిపారు. మృతుడి వయసు 25-30 సంవత్సరాలు మధ్య ఉంటుందని, అతడి సమాచారం తెలిసిన వారు గుడివాడ స్టేషన్ నెం.94406 27570, 98662 21412కు తెలియజేయాలని ఎస్ఐ తెలిపారు.

అవసానదశలో.. అక్షర విజ్ఞానం

నేడు సోషల్ మీడియాలో ప్రపంచ సమాచారం అందుబాటులోకి వచ్చినా.. మన సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన వారసత్వపు విజ్ఞాన సంపద కేవలం గంథాలయాల్లోనే లభిస్తుందన్నది పెద్దల మాట. అంతర్జాలంలో కూడా దొరకని విషయాలు విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాల్లో నిక్షిప్తమై ఉంటుందన్న విషయం తెలిసిందే.. గతం.. వర్తమానానికి వారధిగా నిలుస్తున్న గ్రంథాలకు నెలవులైన గ్రంథాలయాలు నేడు వెలవెలబోతున్నాయి.

- ఆదరణ లేక కనుమరుగవుతున్న గ్రంథాలయాలు
- టీడీపీ హయాంలో అభివృద్ధిపై దృష్టి
- నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం రాకతో పూర్వ వైభవం!

(ఆంధ్రజ్యోతి-నందిగామ)

దశాబ్దాల క్రితం గ్రంథాలయాలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. నేడు సెల్‌ఫోన్ల ద్వారా అరచేతిలోకి ప్రపంచ సమాచారం అందుబాటులోకి రావడంతో గ్రంథాలయాలు మరుగున పడిపోతున్నాయి. గ్రంథ పఠనకు ఒకప్పుడు విజ్ఞాన భాండాగారాలుగా విరాజిల్లిన గ్రంథాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. ఈ తరుణంలో అరుదైన విజ్ఞాన సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. నిర్లక్ష్యం వీడకపోతే గ్రంథాలయాలు కూడా చరిత్రలో కలిసిపోయే ప్రమాదం ఉందనడంలో సందేహం లేదు. ఇప్పటికే గ్రామీణ గ్రంథాలయాలు మూతపడ్డాయి.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 109 గ్రంథాలయాలుండగా.. వాటిలో గ్రేడ్-1 స్థాయిలో 8, గ్రేడ్-2 స్థాయి18, గ్రేడ్-3 స్థాయి 83 ఉన్నాయి. వీటిలో లక్షలాదిగా అరుదైన గ్రంథాలున్నాయి. ప్రభుత్వం చొరవతీసుకుని భావితరాలకు అవసరమైన వారసత్వపు విజ్ఞాన





శిథిలావస్థకు చేరిన విలువైన విజ్ఞాన సంపద



సకల వసతులతో నందిగామ గ్రంథాలయం

సంపదను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. పంచాయతీల నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేయడంతో పాటు ఉమ్మడి కృష్ణాజిల్లాలో కోట్లాది నిధులు వెచ్చించి నూతన భవనాలు నిర్మించింది. నందిగామలో మోడల్ గ్రంథాలయ నిర్మాణం చేపట్టింది. అప్పటి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బండారు హనుమంతురావు చొరవతో సకల సదుపాయాలతో లైబ్రరీ ఏర్పాటుచేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి రూ.48.05 లక్షలు, రాజారామ్మోహన్ లైబ్రరీ ఫౌండేషన్ కలకత్తా వారి నుంచి రూ. 6లక్షలు సమీకరించి భవన నిర్మాణం, కంప్యూటరీకరణ పనులు చేపట్టారు. అదేవిధంగా జిల్లాలో అనేకచోట్ల కంప్యూటర్లు, నూతన భవనాలతో పాటు స్వచ్ఛంద సంస్థల ద్వారా పురాతన రచనల సేకరణ చేపట్టారు. ఈదశలో తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం వల్ల అవి అవసానదశకు చేరుతున్నాయి. కూటమి ప్రభుత్వం మరోమారు గ్రంథాలయాల అభివృద్ధికి బాటలు వేయాల్సి ఉంది. ఆధునిక సమాజాన్ని ఆకర్షించేలా లైబ్రరీలను తయారుచేసి తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు జీవం పోయాల్సి ఉంది.

పీ-4తో పూర్వ వైభవం తేవాలి

గ్రంథాలయాలకు పాలకవర్గాలను ఏర్పాటుచేసి వాటి పూర్వవైభవానికి చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వాల సాయం కోసం ఎదురు చూడకుండా గ్రామ పెద్దలు, ఎన్ఆర్ఐల సహకారంతో లైబ్రరీల అభివృద్ధికి బాటలు వేయాల్సి ఉంది. శిథిలమవుతున్న గ్రంథాలను సేకరించి మరల అచ్చు వేయించడంతో పాటు కంప్యూటరీకరణ చేసే కార్యక్రమాలపై దృష్టి సారించాలని, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 పథకంలో గ్రంథాలయాలకు పూర్వ వైభవం తేవాలని పుస్తక ప్రియులు కోరుతున్నారు.



అన్నవరం దేవస్థానం ఈవో వి.సుబ్బారావు దంపతులకు స్వాగతం పలుకుతున్న దుర్గగుడి ఈవో శీనానాయక్, అర్చకులు

దుర్గమ్మకు అన్నవరం నుంచి సారె

ఇంద్రకీలాద్రి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆషాడమాస ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారికి అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి శుక్రవారం ఈవో వి.సుబ్బారావు దంపతులు సారె సమర్పించారు. ఆలయ అర్చకులు, సిబ్బందితో విచ్చేసిన ఈవో దంపతులకు దుర్గగుడి ఈవో శీనానాయక్ సాదరపూర్వకంగా ఆహ్వానం పలికారు. సాంప్రదాయ రీతిలో అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం వారికి దుర్గమ్మ ప్రసాదం, చిత్రపటం తదితర లాంఛనాలను అందజేశారు. ఈ సందర్భంగా పలు భక్త బృందాలు భక్తి ప్రపత్తులతో దుర్గమ్మవారికి సారె సమర్పించారు.



దుర్గమ్మకు సారె సమర్పించిన భక్త బృందాలు

అంతా పెద్దవారే!

(5వ పేజీ తరువాయి)

ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. మొత్తం 1,200 మంది ఖాతాదారుల నుంచి రూ.300 కోట్లను పెట్టుబడిగా వసూలుచేసి బోర్డు తిప్పేయడంతో ఈయన లీలలు వెలుగులోకి వస్తున్నాయి.

బాధితులుగా ప్రముఖులు

ఆదిత్య.. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎదురుగా, ఈఎస్ఐ రోడ్డులో ఉన్న ఫార్చ్యూన్ హైట్స్‌లో అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఐదేళ్ల కిందట ప్రారంభించాడు. పెట్టుబడి పెట్టినవారికి నెలకు రూ.6 వేల వడ్డీని గత డిసెంబరు వరకు చెల్లించాడు. ఆ తర్వాత నుంచి చెల్లింపులు ఆలస్యమయ్యాయి. దీంతో కొంతమంది పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. ఆదిత్య ఇస్తున్న వడ్డీ సాధారణ, మధ్యతరగతి వారినే కాదు.. ప్రముఖులను కూడా ఆకర్షించింది. రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, పోలీసులు, వైద్యులు ఇక్కడ రూ.లక్షలు పెట్టుబడి పెట్టారు. రాష్ట్రమంత్రి అనుచరులు, కేంద్రమంత్రి సహాయకులు కూడా ఉన్నట్టు తెలిసింది. ఇలా పెట్టుబడులు పెట్టిన వారికి అసలు ఆదిత్య అంటే ఎవరో తెలియదు. అతని ముఖం కూడా చూడలేదు. కొంతమంది ప్రత్యక్షంగా వారి కుటుంబ సభ్యుల పేర్లతో పెట్టుబడులు పెట్టగా, మరికొందరు స్నేహితుల ద్వారా డబ్బు పెట్టించారు. ఒకప్పుడు భవానీపురం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి, ఇప్పుడు నిఘా విభాగంలో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ రూ.50 లక్షలను తన స్నేహితుడి ద్వారా పెట్టుబడి పెట్టించాడు. అలాగే, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాలకు చెందిన రాజకీయ నేతలు.. వారి అనుచరుల ద్వారా పెట్టుబడులు పెట్టించారు. ఆదిత్యతో పాటు అతడి స్నేహితుడినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పత్రికల్లో రావడంతో ఖాతాదారులు అద్విక ట్రేడింగ్ కంపెనీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇప్పటికే మాచవరం పోలీసులు ఆదిత్య, కిరణ్‌పై కేసు నమోదు చేశారు. శుక్రవారం మరో 20 మంది బాధితులు పోలీసుల వద్దకు వచ్చి తమ గోడు చెప్పుకొన్నారు. కాగా, పోలీసులు ఆదిత్యను తీసుకుని అద్విక కార్యాలయానికి వెళ్లారు. లోపల రికార్డులను, పెట్టుబడిదారుల వివరాలను పరిశీలించారు. ఖాతాల వివరాలు తెలుసుకున్నారు. ఆదిత్య వెనుక ఇంకా మరి కొంతమంది ఉన్నారని పోలీసులు గుర్తించారు.

డిలీట్ చేసిన నెంబరెవరిది?

పోలీసుల అదుపులో ఉన్న ఆదిత్య తన భార్య సుజాతతో మాట్లాడుకుంటానని ఓ కానిస్టేబుల్‌కు చెప్పాడు. దీంతో ఆ కానిస్టేబుల్ తన సెల్‌ఫోన్ ఇచ్చాడు. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత డయల్ కాల్స్‌లో ఆ నెంబర్‌ను డిలీట్ చేసి ఫోన్ ఇచ్చాడు. ఇప్పుడు ఆ నెంబరు ఎవరిదన్నది ప్రశ్నగా మారింది. భార్య సుజాతతోనే మాట్లాడాడా, ఇంకెవరితోనైనా సంభాషించాడా అన్నది సస్పెన్స్‌గా ఉంది.

'అద్విక' పేరుతో మోసం

అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యకలాపాలు ఫార్చ్యూన్ హైట్స్ మొదటి అంతస్తులో జరుగుతుండగా, అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ అనే మరో సంస్థను గురునానక్ కాలనీలో నిర్వహిస్తున్నారు. వివిధ ప్రైవేట్ బ్యాంకుల్లో మేనేజర్ల హోదాల్లో పనిచేసిన కొంతమంది కలిసి ఈ సొసైటీని గత నవంబరులో ఏర్పాటు చేసుకున్నారు. దీన్ని ఆదిత్య తన ఖాతాలో వేసుకున్నాడు. మొత్తం 14 మంది ఒక్కొక్కరు రూ.5 లక్షల చొప్పున పెట్టుబడి పెట్టి ఈ సొసైటీ నడుపుతున్నారు. దీనికి ఉన్న అద్విక పేరు తన ట్రేడింగ్ కంపెనీ పేరుతో కలవడంతో మొత్తం ఈ సొసైటీ తనదని ఆదిత్య చెప్పుకొన్నాడు. ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారందరికీ ఇదే చెప్పాడు. అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రారంభించాక బ్యాంకింగ్ రంగంలో అనుభవం ఉన్న వ్యక్తిని చైర్మన్‌గా నియమించాలని నిర్ణయించుకున్నారు. ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లో పనిచేసిన కిరణ్ అనే వ్యక్తికి సొసైటీలోని సభ్యులు ఈ విషయం చెప్పారు. అప్పుడు కిరణ్ ఆదిత్య భార్య సుజాతను వారికి పరిచయం చేశాడు. కొటక్ మహేంద్ర బ్యాంక్‌లో గోల్డ్‌లోన్ విభాగంలో పనిచేసిన అనుభవం ఉండటంతో సుజాతను చైర్మన్ చేశారు. ఈ సొసైటీ ప్రారంభోత్సవానికి ట్రేడింగ్ కంపెనీలో సభ్యులుగా ఉన్న వారందరినీ ఆదిత్య పిలిచాడు. అప్పటికే ఈ సొసైటీ తమదేనని బిల్డప్ ఇచ్చాడు. తర్వాత అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ తనదేనని ఆదిత్య చెప్పుకొంటున్న విషయం సొసైటీ పాలకవర్గానికి తెలిసింది. దీంతో చైర్మన్‌గా ఉన్న సుజాతను పిలిచి అడిగారు. సొసైటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఐదారుసార్లు మాత్రమే ఈ కార్యాలయానికి వచ్చిన ఆమె ఈ ఏడాది ఏప్రిల్ 10న పదవికి రాజీనామా చేసింది.

అరెస్టుకు ముందు సమావేశం

పోలీసులు అరెస్టు చేయడానికి ముందు ఆదిత్య ఏజెంట్లతో సమావేశం నిర్వహించాడు. అప్పటికే నష్టాలు ఉన్నాయని తెలిసినా ఏజెంట్లను నమ్మించే ప్రయత్నం ఈ సమావేశంలో చేశాడు. తనను నమ్మితే మొత్తం చెల్లింపులు చేస్తానని భరోసా ఇచ్చాడు. ఈ ప్రయత్నం బెడిసికొట్టింది. ఇక తాము నమ్మలేమని ఏజెంట్లు మూకుమ్మడిగా చెప్పారు. ఆ సమావేశంలో ఆదిత్య ప్రసంగ వీడియోలు 'ఆంధ్రజ్యోతి'కి అందాయి.

హవాలా మార్గంలో దుబాయికి..

పెట్టుబడులుగా వసూలు చేసిన నిధులను ఆదిత్య హవాలా మార్గంలో దుబాయికి మళ్లించినట్టు పోలీసులు గుర్తించారు. దుబాయిలో షబానా అనే ట్రేడింగ్ కంపెనీకి ఈ డబ్బు వెళ్లింది. కొద్దిరోజుల కిందట ఆదిత్య తన పుట్టినరోజు వేడుకలను వైజాగ్‌లోని స్టార్ హోటల్‌లో నిర్వహించాడు. దీనికి అక్షరాలా రూ.70 లక్షలు ఖర్చయ్యింది. విజయవాడ నుంచి ఏజెంట్లను, ఉద్యోగులను విమానంలో అక్కడికి తీసుకెళ్లాడు. అంతేకాదు.. ఆదిత్య శృంగారలీలలు కూడా బయటపడుతున్నాయి. ఆదిత్య ల్యాప్‌టాప్‌ను పోలీసులు విశ్లేషించగా, అందమైన అమ్మాయిలు, ఆదిత్య నగ్నంగా ఉన్న వీడియోలను పోలీసులు గుర్తించారు. ఈ అందమైన అమ్మాయిల ఫొటోలను ఆయన ఒక ఫోల్డర్‌లో భద్రపరిచాడు.

సొసైటీతో ఆదిత్యకు సంబంధం లేదు

- కుందేటి రమేశ్, సీఎఫ్‌వో, అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ

ఎన్టీఆర్ కాలనీలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీతో ఎలాంటి సంబంధం లేదు. 14 మంది డైరెక్టర్లుగా సహకార శాఖ అనుమతితో ఈ సొసైటీని ఏర్పాటు చేసుకున్నాం. మహిళా సాధికారత కోసం ఇందులో మహిళలను ఉద్యోగులుగా నియమించాం. వారికి బ్యాంకింగ్ రంగంపై అవగాహన కోసం హైదరాబాద్‌లోని ప్రసాద్ బ్యాంకింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఇప్పించాం. వాళ్లు నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని ఉద్యోగులుగా నియమించాం. మా సొసైటీలో ఖాతాదారులకు సంబంధించిన అన్ని వివరాలు పక్కాగా ఉన్నాయి. అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సభ్యులు చెల్లింపులు చేయకపోవడంతో చాలామంది ఖాతాదారులు మా వద్దకు వచ్చారు. ఈ సొసైటీలో అతనికి సంబంధం లేదని చెప్పాం. మా సొసైటీ పేరు, అతని కంపెనీ పేరు ఒకటే కావడంతో ఈవిధంగా ప్రచారం చేసుకున్నాడు. అందుకే మా సొసైటీ పేరును మార్చుకోవాలని నిర్ణయించుకున్నాం. సంస్థను ప్రారంభించి ఏడాది కాకపోవడంతో సాధ్యం కాలేదు.

బదిలీ వార్

(5వ పేజీ తరువాయి)

కొంతమంది ఉద్యోగులకు పదోన్నతి ఇచ్చి కీలక ప్రాంతాలకు బదిలీ చేయటం కూడా వివాదాస్పదంగా మారింది.

బదిలీ జరిగినా రిలీవ్ కాని ఉద్యోగులు

జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేసే ఉద్యోగులకు ఈ నెల 9న బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. బదిలీ కోరుకున్న ఉద్యోగులు.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. శాసనసభ్యులు కొంతమంది ఉద్యోగులను తమ నియోజకవర్గంలో వద్దని కూడా లేఖలు ఇచ్చారు. వీటిలో మండల పరిషత్‌లలో పనిచేసే ఎంపీడీవోలు, ఏవోలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రజాప్రతినిధులు వద్దని సిఫార్సు చేసిన ఉద్యోగులను వేరే నియోజకవర్గాలకు బదిలీ చేసి, ఖాళీ అయిన స్థానాల్లో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారిని నియమించలేదు. జడ్పీ అధికారుల చిత్తానుసారం వేరే ఉద్యోగులను మండలాలకు బదిలీ చేశారు. దీంతో ఈ బదిలీల జాబితాను పరిశీలించిన ఎమ్మెల్యేలు, మంత్రులు తాము సూచించిన వారిని కాకుండా వేరే ఉద్యోగులను బదిలీ చేయటంతో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో బదిలీ అయిన ఉద్యోగులు వారికి కేటాయించిన మండలాల్లో చేరేందుకు అవకాశం లేకుండాపోయింది. 18 రోజులుగా ఉద్యోగులు తాము ఎక్కడ విధులు నిర్వహించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

సంతకం పెట్టనన్న జడ్పీ చైర్‌పర్సన్

ఇష్టానుసారంగా బదిలీలు చేస్తే ఉత్తర్వులపై సంతకం పెట్టేది లేదని కౌన్సెలింగ్ జరిగే సమయంలోనే చైర్‌పర్సన్ ఉప్పాల హారిక చెప్పారు. అయినప్పటికీ జడ్పీ సీఈవో బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఈ బదిలీల అనంతరం పంచాయతీరాజ్ విభాగ కమిషనర్ ఆగిరిపల్లి మండలం పర్యటనకు రాగా, అక్కడకు వెళ్లిన జడ్పీ సీఈవో అన్ని విషయాలను ఆయనకు వివరించారు. చైర్‌పర్సన్ సంతకం లేకున్నా.. ఆ ఫైలును తనకు పంపాలని కమిషనర్ చెప్పినట్లు ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు.

సస్పెండ్ అయిన ఇద్దరు ఏవోలకు పోస్టింగులు

ఇసుకకు సంబంధించిన వివరాలు సక్రమంగా చూపకపోవడం, ఇతరత్రా ఆరోపణలపై కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏవోను గతంలో సస్పెండ్ చేశారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేసే అధికారి ఒక్కరోజు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉండి మండల పరిషత్ నిధులు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు డ్రా చేశాడు. ఈ విషయం వెలుగులోకి రావడంతో విచారణ చేసి అతడ్ని కూడా సస్పెండ్ చేశారు.

ఈ ఇద్దరు ఏవోలకు ఇటీవల వేరే మండలాల్లో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ బదిలీలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాకుండానే నిర్వహించారు. తన దృష్టికి రాకుండా బదిలీ ఎలా చేశారని ఆమె ఫైల్‌పై సంతకం చేయలేదు. ఈ ఇద్దరు ఏవోలకు పోస్టింగ్‌లు ఇచ్చే విషయంలో నగదు చేతులు మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఎవరెవరికి ఎంత నగదు ఇచ్చారో లిఖితపూర్వకంగా రాసిస్తే, విచారణ అనంతరం సంతకం పెడతానని చైర్‌పర్సన్ చెబుతున్నారు. అలాగే, కలిదిండి, రెడ్డిగూడెం మండలాల్లో ఖాళీలున్నా ఉద్యోగులను బదిలీ చేయలేదు. పమిడిముక్కల, మొవ్వ, విజయవాడ రూరల్ మండలాల్లో జూనియర్ అసిస్టెంట్లు, ఇతర విభాగాల ఉద్యోగులు వేరే మండలాలకు బదిలీ అయినా వారిని రిలీవ్ చేయలేదు. ఈ పరిణామాలన్నీ ఎటువైపునకు దారితీస్తాయనే అంశంపై జడ్పీలో చర్చ జరుగుతోంది.

అజ్ఞాతం వీడి..

(5వ పేజీ తరువాయి)

నాయకులు చేసిన ప్రచారం తర్వాత ఆయనేం అయిపోయారోననే చర్చ జరిగింది. చాతీకి పట్టీతో ఉన్నప్పటికీ నడక, నడతలో ఏమాత్రం స్పీడ్ తగ్గలేదు. గుడివాడ కోర్టు ప్రాంగణం ముందు కారు దిగిన కొడాలి నాని వేగంగా నడుచుకుంటూ కోర్టులోకి వెళ్లిపోయారు. ఎవరి సాయం లేకుండానే కోర్టు మెట్లను అవలీలగా ఎక్కేశారు.

కావాలనే ప్రచారం చేశారా?

అరెస్టు నుంచి తప్పించుకోవడం కోసం ఓ పథకం ప్రకారమే వైసీపీ నాయకులు.. కొడాలి నాని ఆరోగ్యం బాగోలేదని, హార్ట్ పంపింగ్ రేటు 60 నుంచి 30కి పడిపోయిందని ప్రచారం చేశారు. నియోజకవర్గానికి మరో నాయకుడిని చూసుకోమని కొడాలి నాని అధిష్టానానికి చెప్పారని, ఆయనకు అమెరికాలో అత్యున్నత వైద్యం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం కూడా జరిగింది. ఈ ప్రచారాలన్నీ నిజమేనేమోనని చాలామంది ఆయన ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. ముంబయిలో ఆయన గుండెకు శస్త్రచికిత్స చేశాక ఈ ప్రచారానికి బలం చేకూరింది. నాని ఇప్పట్లో గుడివాడ రారని, వస్తే ఆయనకు ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఉందని స్థానిక నాయకులు ప్రచారం చేశారు. హైదరాబాద్‌లో ఆయన్ను కలిసేందుకు కూడా అనుమతించలేదు. అయితే, శుక్రవారం గుడివాడ వచ్చిన ఆయన్ను చూసి నియోజకవర్గ ప్రజలు షాక్ అయ్యారు. కారు నుంచి దిగుతూ వేగంగా ముందుకు కదలటం, మెట్లను కూడా అవలీలగా ఎక్కటంతో ఆయన ఆరోగ్యంపై అంచనాలన్నీ తలకిందులయ్యాయి. కాగా, ఆయన్ను చూసేందుకు వైసీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వారితో నాని ఉత్సాహంగా మాట్లాడటంతో పాటు ఆయన సెల్ఫీలు కూడా దిగారు. దీనినిబట్టి వైసీపీ నాయకులు కావాలని ప్రచారం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి.

మార్గంసుగమం

(5వ పేజీ తరువాయి)

నుంచి చింతలమడ బిరుదుగడ్డ మీదుగా దేవరకోట వెళ్లే రహదారి అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. కొద్దికాలానికే ఎన్నికలు జరగటం, ప్రభుత్వం మారటంతో ఈ పనులపై నీలినీడలు అలముకున్నాయి. పనులు ప్రారంభించినా అసంపూర్తిగా నిలిపేశారు. లంకతోటకు వెళ్లే మార్గంలో శ్లాబ్ కల్వర్టు, చింతలమడ వెళ్లే మార్గంలో శ్లాబ్ కల్వర్టు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వర్షాల సమయంలో రహదారులు అధ్వానంగా మారటంతో పాటు శ్లాబ్ కల్వర్టుల వద్ద ప్రత్యామ్నాయ రహదారులపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. పనుల నిర్మాణం చేపట్టేందుకు కాంట్రాక్టు సంస్థకు ఇచ్చిన గడువు సైతం పూర్తయింది. గడువును ఎప్పటికప్పుడు పెంచుకుంటూ వెళ్లినప్పటికీ ఐదేళ్లు పూర్తికావడంతో పనులపై నీలినీడలు అలముకున్నాయి.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, ఎమ్మెల్యేగా మండలి బుద్ధప్రసాద్ విజయం సాధించటంతో పనులు పూర్తవుతాయనే ఆశ ప్రజల్లో నెలకొంది. అసంపూర్తిగా నిలిచిన పనులను పూర్తిచేసేందుకు ప్రభుత్వం సిద్ధపడటం, అధికారుల ద్వారా పనుల వివరాలు సేకరించి పూర్తిచేసేందుకు నిధులు విడుదల చేస్తూ ఇటీవల ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. 2018, ప్రస్తుత అంచనాలకు వ్యత్యాసం ఉండటంతో పెరిగిన ధరల ఆధారంగా అంచనాలు కూడా పెంచారు.గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థకు 2026, మార్చి వరకు గడువు పొడిగించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. చింతలమడ-దేవరకోట రహదారి, కల్వర్టుల నిర్మాణానికి రూ.రూ.2.13 కోట్లు, లంకతోట రహదారి నిర్మాణానికి రూ.1.80 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఇటీవల ప్రకటించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

163 మందికి పింఛన్లు మంజూరు

హనుమాజంక్షన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా స్పౌజ్ పెన్షన్ కింద మండలానికి 163 మందికి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసినట్లు బాపులపాడు ఇన్‌చార్జి ఎంపీడీవో త్రినాథతిరుమలరావు శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. భర్త లేదా భార్యను కోల్పోయిన వారికి జూలై మాసం నుంచి రెగ్యులర్‌గా పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

రూ. 11.61 కోట్ల ఆస్తి పన్ను వసూలు

కానూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మున్సిపల్ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ. 11.61 కోట్లు ఆస్తిపన్ను (ప్రాపర్టీ ట్యాక్స్) వసూలు చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. మున్సిపల్ పరిధి కానూరు, పోరంకి, తాడగడప, యనమలకుదురు గ్రామాల్లో 47, 427 గృహాల నుంచి రూ. 25.91 కోట్లు ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉందని, దీనికి సంబంధించి ఇప్పటికే వినియోగదారులకు డిమాండ్ నోటీసులు అందజేశామని, సుమారు ఇప్పటికే 45శాతం వరకు ఆస్తిపన్ను వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంకా రూ. 14.3 కోట్లు ఆస్తిపన్ను వసూలు కావలసి ఉందని, ఈ ఏడాది ఏప్రిల్- సెప్టెంబరుకు సంబంధించి మొదటి అర్ధ సంవత్సరానికి గాను ఈ నెల 30వ తేదీ లోపు అపరాధ రుసుం లేకుండా ఆస్తిపన్ను చెల్లించవచ్చునని తెలిపారు. అక్టోబరు నుంచి వచ్చే ఏడాది మార్చి లోపు చెల్లించే రెండవ అర్ధసంవత్సరానికి గాను అపరాధ రుసుం లేకుండా ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీలోపు ఆస్తిపన్ను చెల్లించ వలసి ఉంటుందని, ఈ ఆస్తిపన్నును ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని లేదా కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు సచివాలయం-1లో కూడా చెల్లించవచ్చని వివరించారు. కాగా ఈ నెల మొదటి వారం నాటికి మున్సిపల్ పరిధిలో 1283 ఖాళీ స్థలాలకు పన్నువేయాలని స్థల యజమానులు దరస్తుకాస్తులు చేసుకోగా వారి నుంచి ఖాళీస్థలాల పన్నుగా రూ. 2.41 కోట్లు వచ్చాయని మున్సిపల్ అధికారులు చెప్పారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ నిర్వాహకులు

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పెనమలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పోరంకి వాసవీ క్లబ్ నవ నిర్మాణ కపుల్స్ సంస్థ శుక్రవారం విద్యార్థులకు ఐదువేల విలువైన నోటు పుస్తకాలు పంపిణీ చేసింది. పోరంకి విజ్ఞాన్ భారత్ పాఠశాలలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో సంస్థ రీజియన్ సెక్రటరీ కేవీ మస్తానయ్య మాట్లాడుతూ, పేద విద్యార్థులకు తమవంతు సాయంగా ప్రతిఏడాది పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ కొడాలి రామశేషాద్రిరావు మాట్లాడుతూ, వాసవీక్లబ్ ప్రతియేటా విద్యార్థులకు విలువైన పుస్తకాలను అందిస్తున్న వాసవీక్లబ్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ ప్రెసిడెంట్ పెనుగొండ హారిక, సెక్రటరీ కారంశెట్టి శైలజ, ప్రిన్సిపాల్ రాము, వైస్‌ప్రిన్సిపాల్ రత్నకుమారి, ప్రధానోపాధ్యాయురాలు శైలజ, జీ ఆంజనేయులు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

విద్యార్థికి రాణా వెల్ఫేర్ సొసైటీ ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యాభివృద్ధికి సహకారం అందిస్తూ రాణా వెల్ఫేర్ సొసైటీ సామాజిక సేవల చేయడం అభినందనీయమని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. కానుమోలుకు చెందిన జస్వంత్‌కు రాణా వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఇంటర్ విద్య ఫీజు నిమిత్తం రూ.10వేల సాయాన్ని ఆయన చేతుల మీదుగా శుక్రవారం విద్యార్థి తండ్రి సురేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంక సాంబశివరాయల్, నవనీతం సాంబశివరావు, గంటా కృష్ణమోహన్, భూపతి మహేష్‌కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధుల ఆగ్రహం

ఉయ్యూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ అధ్యక్షురాలు చీలి కల్పన అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని గైర్హాజరైన వారిపై చర్యలకు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు.

థైరాయిడ్ కంటి వ్యాధిపై అప్రమత్తత అవసరం

ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సంజన

పెనమలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : థైరాయిడ్ అంటే జుట్టు రాలడం, శరీర బరువుకు సంబంధించిన సమస్యలు, శక్తిస్థాయిలు, హార్మోన్‌ల అసమతుల్యత లాంటి ప్రభావాలు మాత్రమే మనకు తెలుసునని, ఈ వ్యాధి కంటి చూపును కూడా ప్రభావితం చేస్తుందని ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సంజన పేర్కొన్నారు. శుక్రవారం తాడిగడపలోని ఆసుపత్రి ఆవరణలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ, థైరాయిడ్ కంటి వ్యాధి అనేది థైరాయిడ్ గ్రంధులు సరిగ్గా పనిచేయని వారిలో కనిపించే రుగ్మత అని, దీని కారణంగా కళ్ల రూపంలోనూ, పనితీరులోనూ మార్పులు వస్తాయన్నారు.

నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తా

- ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాల్లో మినీ పారిశ్రామిక వాడలు
- గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపనలో ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాల్లో మినీ పారిశ్రామికవాడల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక గాంధీ, బొమ్మ సెంటర్‌లో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ, తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్టీఆర్ కాంస్య విగ్రహాల ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యేలు ముల్పూరి బాలకృష్ణారావు, డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు లతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలంలో పరిశ్రమలు ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించి, వాటి వివరాలతో సీఎం చంద్రబాబును కలసి చర్చించి ఈ రెండు మండలాల్లోను మినీ పారిశ్రామికవాడలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు వస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా మల్లవల్లి పారిశ్రామికవాడ విస్తరణ కోసం పక్కనే ఉన్న 470 ఎకరాల అసైండ్ భూములను సేకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. వీరపనేనిగూడెంలో పరిశ్రమల ఏర్పాటుకు మరో 49 ఎకరాల భూమి అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో ప్రధాన కుడలిగా ఉన్న గాంధీ బొమ్మ సెంటర్‌ను అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు రహదారి విస్తరించి డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని, మూడు బొమ్మల సెంటర్లో రహదారికి అడ్డుగా ఉన్న మాజీ ప్రధాన మంత్రుల విగ్రహాలను పక్కకు జరిపి ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కనే ఏర్పాటు చేస్తామని ఇప్పటికే చెప్పామన్నారు. దీనిపై గ్రామపంచాయతీ తీర్మానం కూడా చేశారన్నారు. గాంధీ బొమ్మ సెంటర్లో ఉన్న గాంధీ విగ్రహం ఆలనా పాలనా లేక శిథిలావస్థకు చేరిందని దాన్ని మార్చి సొంత నిధులతో కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు తాను సిద్ధపడగా, ఆర్యవైశ్య సంఘం నాయకులు విగ్రహం ఏర్పాటులో తాము భాగస్వామ్యం అవుతామని ముందుకు వచ్చి రూ.4.50 లక్షలు ఇచ్చారని తెలిపారు. 2002లో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఇక్కడ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేశారని, ఆ విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహం ఏర్పాటుకు మళ్లీ నాదెండ్ల మురళి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడపాటి తులసి మోహన్, గొడ్డళ్ల చిన్న రామారావు, దయాల రాజేశ్వరరావు, ఆరుమళ్ల సాంబిరెడ్డి, దొంతు చిన్న, చిరుమామిళ్ల సూర్యం, జాస్తి విజయ భూషణ్ కుమార్, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయికళ్యాణి, చిగురుపాటి కుమారస్వామి, చిమటా రవి వర్మ, కోటగిరి వరప్రసాద్, కొల్లా ఆనంద్, గూడవల్లి నరసయ్య అధికారులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.



గాంధీజీ, ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు



ముదునూరు ప్రజాదర్బార్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆర్థిక స్తోమత ఉన్నవారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వదులుకోవడంతో పాటు నిజమైన పేదలకు అందేందుకు తమ వంతు సహకరించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కోరారు. ముదునూరులో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు ఎక్కువ మంది ఆశించడంతో పేదరికంలో ఉన్నవారికి పూర్తిస్థాయిలో న్యాయం జరగడంలేదని భావిస్తున్నాని, సమస్యలు నిరంతర ప్రక్రియ అని ఎన్ని సమస్యలు పరిష్కరించినప్పటికి కాలంతో పాటు మరికొన్ని సమస్యలు వస్తుంటాయన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఎందరు ప్రజాప్రతినిధులు వచ్చినా గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదన్నారు. మన గ్రామం, మన మండలం, మన నియోజకవర్గం, మన జిల్లా, మన రాష్ట్రం, మన దేశం అనే ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో ఏవిధమైన అభివృద్ధి జరగలేదని విమర్శించారు. త్వరలో కాటూరు- ముదునూరు, ఉప్పలూరు- వేల్పూరు, కోమటిగుంట -తెన్నేరు రోడ్ల గుంతలు పూడ్చి మరమ్మతులు చేపడతామన్నారు. సర్పంచ్ మొవ్వ వెంకటనాగలక్ష్మి, టీడీపీ నాయకులు జ్ఞాన శేఖర్, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, పలువురు పార్టీ నాయకులు, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ఎన్ చిన్ననరసింహులు

హనుమాన్‌జంక్షన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ పశువులకు నాణ్యమైన సేవలు అందించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.చిన్ననరసింహులు పశువైద్య సిబ్బందికి సూచించారు. బాపులపాడు ఏరియా పశువైద్యకేంద్రం ఏడీ సీహెచ్ శ్రావణ్ కుమార్ బదిలీపై నెల్లూరు జిల్లా చింతలదీవి కాటిల్ ఫామ్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ నుంచి ఎం.ప్రమీలారాణి ఇక్కడికి బదిలీపై వచ్చారు. శుక్రవారం ప్రమీలారాణి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని పశువైద్య సిబ్బందితో సమావేశంలో నిర్వహించి పశుసంతతి, జీవాలకు అందించాల్సిన వైద్యసేవలపై జేడీ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అన్నికరాలు వైద్యసేవలు అందించాలన్నారు. బదిలీ అయిన ఏడీ శ్రావణ్‌కుమార్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో గన్నవరం డీడీ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు వేయించాలి

గన్నవరం : జీవాలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు వేయించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో శుక్రవారం పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ చేసే 15 రోజుల క్యాంపును జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ చిన నరసింహులుతో కలిసి ప్రారంభించారు. డాక్టర్లు గోపీచంద్, బాలకృష్ణ, రెడ్డమ్మ, మేరీ వైడూర్యం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

గన్నవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో ఆర్బిడ్స్ ఆధ్వర్యంలో డిపాజిటర్ అవగాహన శుక్రవారం జరిగింది. ఆర్బిడ్స్ కార్యదర్శి యర్రు సాంబశివరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీ రుణాలు, బ్యాంక్ ఖాతాల నిర్వహణ గురించి వివరించారు. డిపాజిటర్‌లకు హక్కులు ఉంటాయని తెలిపారు. ఏపీఎం సాంబశివరావు, మండల సమైక్య అధ్యక్షురాలు కోనేరు రమామణి తదితరులు పాల్గొన్నారు.

ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలకు

ప్రతిష్టాత్మక ఐఎస్‌వో గుర్తింపు



ఉంగుటూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలకు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్‌వో) 21001-2018 గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం తెలిపారు. శుక్రవారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఐఎస్‌వో ప్రతినిధి హరగోపాల్ చేతుల మీదుగా ఆయన గుర్తింపు పత్రాన్ని అందుకున్నారు. కళాశాలకు రెండోసారి ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ గుర్తింపు లభించడం సంతోషకరమన్నారు. ఐఎస్‌వో ప్రతినిధి హరగోపాల్ మాట్లాడుతూ, అత్యాధునిక ప్రయోగశాలలు, సాంకేతిక విద్యాబోధన, ఉపాధి అవకాశాల కల్పన, పచ్చదనం-పరిశుభ్రత అంశాలను పరిశీలించి సర్టిఫికెట్స్‌ను అందజేస్తామన్నారు. ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, ఐఎస్‌వో కోఆర్డినేటర్ ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న జిల్లా జడ్పీ సీఈవో

గంగూరులో చెత్త సేకరణ పరిశీలన

పెనమలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగూరు 2 సచివాలయ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని జిల్లా జడ్పీ సీఈవో కన్నమనాయుడు పరిశీలించారు. గ్రామంలో నివాసితులను చెత్త సేకరణ గురించి ఆరా తీశారు. సీఈవో వెంట ఎంపీడీవో బండి ప్రణవి, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, సర్పంచి తస్లీమున్నీసా ఉన్నారు.

నేషనల్ లోక్ అదాలత్ 5న

ఉయ్యూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు సివిల్ జడ్జి కోర్టులో జూలై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సెల్ కమిటీ కమ్ సివిల్ కోర్టు న్యాయాధికారి కె. శ్రీహరి తెలిపారు. లోక్ అదా లత్‌లో రాజీపడతగిన క్రిమినల్ కేసులు, ప్రోనోటు కేసులు, సివిల్ కేసులు, ఇతర కేసులు రాజీ చేసుకోవాలని శుక్రవారం తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విజయవాడ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : విజయ వాడ రూరల్ మండలం పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నున్న విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ శివారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా నున్న, పాతపాడు, మంగళాపురం, అప్పారావుపేట, పి. నైనవరం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు

ఉయ్యూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. సమాజం నుంచి గంజాయి, మాదక ద్రవ్యాల భూతాన్ని తరిమివేసే చర్యల్లో భాగంగా శుక్రవారం గండిగుంట, ఇతర ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్నారన్న అనుమానమున్న ప్రదేశాలను సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. ఆయా ప్రదేశాల్లో సంచరిస్తున్న అనుమానిత వ్యక్తులను విచారించి, గతంలో గంజాయి కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వ్యక్తుల రోజువారీ కార్యకలాపాలపై సమాచారం సేకరించినట్లు సీఐ తెలిపారు.

హనుమాన్‌జంక్షన్ : మాదక ద్రవ్యాలు సరఫరా చేసినా, విక్రయించినా, వినియోగించినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై వి.సురేష్ హెచ్చరించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా ఉన్నతాధికారులు పిలుపు మేరకు శుక్రవారం జంక్షన్‌లో పలు అనుమానిత ప్రాంతాల్లో ఎస్సై ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ ఏరియా, ఆర్వోబీ కింద, గ్రామంలోని పలు అనుమానిత ప్రాంతాల్లో ఎస్సై తనిఖీలు నిర్వహించారు. ఎక్కడైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.



గండిగుంటలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రామారావు

పెనమలూరు : జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు శుక్రవారం పెనమలూరు పోలీసులు బృందాలుగా ఏర్పడి వివిధ శివారు ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. యనమలకుదురు డొంకరోడ్డు, కృష్ణా కరకట్ట, యనమలకుదురులో పోలీసులు గుర్తించిన ప్రాంతాల్లో ఆకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు. మండలంలో గంజాయి వినియోగం, అమ్మకాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ ఫిరోజ్ తెలిపారు. తనిఖీలు నిరంతరం జరుగుతాయని ఆయన తెలిపారు. గంజాయి వినియోగదారులు, అమ్మకందారులపై నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేసి రిమాండుకు తరలిస్తామని హెచ్చరించారు.

రింగ్ సెంటర్ అదరహో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నిన్న మొన్నటి వరకు కళా విహీనంగా ఉన్న ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ ఇప్పుడు కళకళలాడిపోతోంది. కళాత్మకంగా కనువిందు చేస్తోంది. రింగ్ దుస్థితిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో కొండపల్లి మున్సిపల్‌శాఖ అధికారులు స్పందించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రింగ్ సుందరీకరణ పనులు చేపట్టారు. ప్రజలకు స్వాగతం చెప్పేలా మన కొండపల్లి అంటూ లవ్ సింబల్ ఏర్పాటు చేసి గ్రీనరీతో పూల మొక్కలు, కొండపల్లి బొమ్మలతో కనువిందు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతికి పలువురు అభినందనలు తెలిపారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)



రింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మన కొండపల్లి లవ్ సింబల్


ఏనుగు అంబారీ కొండపల్లి బొమ్మ


తాటిచెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు.. కొండపల్లి బొమ్మకు రంగులద్దుతున్న కళాకారులు


ఎద్దుల బండి కొండపల్లి బొమ్మ


కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, వైసీపీ కార్పొరేటర్లు

బడ్జెట్ ప్రతిపాదనలకు ఖర్చుల వివరాలు ఇవ్వని కమిషనర్

● కలెక్టర్ బాలాజీకి మేయర్, వైసీపీ కార్పొరేటర్ల ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కమిషనర్ 2024-25 జమ ఖర్చుల వివరాలు ఇవ్వడం లేదంటూ నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్, వైసీపీ కార్పొరేటర్లు శుక్రవారం కలెక్టర్ డీకే బాలాజీకి ఫిర్యాదు చేశారు. బడ్జెట్ ప్రతిపాదనలకు నిధుల వినియోగం వివరాలు ఇవ్వకుండా కమిషనర్ అత్యవసర పనులంటూ పాలకవర్గ దృష్టికి తీసుకురాకుండా రూ.32 కోట్లు ఖర్చు పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు 2024 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన ఆర్థిక సంవత్సరానికి 2025 మార్చి 31 వరకు జమా ఖర్చులు మునిసిపల్ కమిషనర్ ఇస్తే బడ్జెట్‌ను రూపొందించుకుంటామన్నారు. పాలక వర్గం ఆమోదం లేకుండా నిధులు వెచ్చిస్తున్నారన్నారు. మేజార్టీ కార్పొరేటర్లు ఎన్నికైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం లేనందున బందరు శాసనసభ్యుడు చెప్పినట్టే అన్నీ జరుగుతున్నాయన్నా రు. 2025 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనప్పటికీ బిల్లులు పాస్ చేస్తున్నారన్నారు. బదిలీపై మే 9న వచ్చిన జేఏవోకు ఇంత వరకు చార్జ్ అప్పగించలేదన్నారు. నిబంధనల ప్రకారం నగర పాలక సంస్థ కార్యకలాపాలు నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను వైసీపీ కార్పొరేటర్లు కోరారు. మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ డిప్యూటీ మేయర్ ఎం విజయలక్ష్మి, మాజీ మేయర్ వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్లు మేకల సుబ్బ న్న, చిరంజీవి, శీలం భారతి, రాసంశెట్టి వాణిశ్రీ, నాయకులు బందెల థామస్, అజ్గర్, శీలం బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీలోనూ రోగుల అవస్థలు

● కార్డియాలజీ విభాగంలో మౌలిక సమస్యలు
● మూసి ఉన్న టాయిలెట్లు ● బయటకుపోని నీరు
● తలుపులు ఊడిపోయిన దివ్యాంగుల టాయిలెట్లు

విజయవాడలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు డాక్టర్లు మంచి వైద్యసేవలందిస్తున్నారనే పేరుంది. అయితే, మౌలిక సౌకర్యాల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. కార్డియాలజీ విభాగంలో టాయిలెట్ల దుస్థితి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి చెడ్డపేరు తీసుకువస్తోంది.




మూసి ఉన్న టాయిలెట్, తలుపులేని దివ్యాంగుల టాయిలెట్


తలుపు ఊడిపోయిన టాయిలెట్, బయటకు పోని నీరు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/ప్రభుత్వాసుపత్రి)

గతంలో ఎన్నడూ లేని విధంగా సూపర్ స్పెషాలిటీలో సమస్యలు పెరిగిపోతుండడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పలు విభాగాల్లో టాయిలెట్స్ పనిచేయడం లేదు. నీరు బయటకు వెళ్లకపోవడంతో టాయిలెట్స్‌కు వెళ్లడానికి రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి మూడో అంతస్తులో కార్డియాలజీ విభాగంలో ఉన్న టాయిలెట్‌లో నీరు నిలిచి రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కొన్ని బాత్‌రూం తలుపులను మూసి వాటిని తాళ్లతో కట్టేయడంతో నిరుపయోగంగా ఉన్నాయి. మరికొన్ని బాత్‌రూంలు తెరిచి ఉన్నప్పటికీ బయటకు నీరు వెళ్లక రోగులు, వారి సహాయకులు అనేక అవస్థలు పడుతున్నారు. దివ్యాంగుల టాయిలెట్స్ తలుపులు ఊడిపోయి ఉండడంతో అవసరానికి వెళ్లలేక, వెళ్లినా తలుపును మూసుకోలేక నానా కష్టాలు పడుతున్నారు. కార్డియాలజీ విభాగానికి గుండె సంబంధిత రోగులు వస్తారు. వారికి ఆపరేషన్ చేసే సమయానికి వారి ఇతర ఆరోగ్య సమస్యలు నియంత్రణలో ఉండాలి. గుండె సమస్యలతో ఇబ్బందిపడుతున్న రోగులు కార్డియాలజీ విభాగంలో ఉన్న టాయిలెట్స్ పనిచేయకపోవడంతో రెండో అంతస్తులో ఉన్న టాయిలెట్స్‌ను వినియోగించుకుంటున్నారు. గుండె సంబంధిత రోగులు కిందకి, పైకి తిరగడంతో ఆయాసం రావడం, బీపీ పెరిగిపోవడం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆయాసం, బీపీ పెరగడం వల్ల ఆపరేషన్ వాయిదా పడితే రోగులు మరింత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

టాయిలెట్స్‌లోకి వెళ్లలేకపోతున్నాం

మా మామయ్యకి గుండె సమస్య ఉంది. పరీక్షలు చేసి గుండెకు స్టెంట్ వేయాలని వైద్యులు సూచించారు. వైద్యం విషయంలో అంతా బాగానే ఉంది. కానీ టాయిలెట్స్‌కు వెళ్లాంటే ఇబ్బందిగా ఉంది. టాయిలెట్స్‌లో ఉపయోగించిన నీరు బయటకు పోవడం లేదు. రోగిని తీసుకుని టాయిలెట్స్‌లోకి వెళ్లాలంటే పడిపోతాడేమేనని భయంగా ఉంది. దీంతో రెండో అంతస్తులో ఉన్న టాయిలెట్స్‌కు వెళ్తున్నాం. నడుచుకుంటూ వెళ్లడం వల్ల రోగికి ఆయాసం వస్తోంది. దివ్యాంగుల టాయిలెట్స్ మరీ ఘోరంగా ఉన్నాయి. తలుపు లేవు. ఆసుపత్రి అధికారులు, సిబ్బంది సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి. - మన్మథ, రాణీగారితోట

గుడివాడ పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగి దుర్మరణం



పామర్రు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై బల్లిపర్రు అడ్డరోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగి దుర్మరణం చెందాడు. గుడివాడ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పెనమలూరుకు చెందిన కొసనం రత్నాకర్ (38) విధులకు హాజరయ్యేందుకు బైక్ మీద గుడివాడ వెళ్తుండగా బల్లిపర్రు అడ్డరోడ్డు వద్ద వ్యాను ఢీకొంది. రత్నాకర్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్సై రాజేంద్ర ప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బూదవాడ యువకుడు అనుమానాస్పద మృతి

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బూదవాడకు గుగ్లోతు సంతోష్ కుమార్(19) అనుమానస్పద స్థితిలో చనిపోయాడు. ఈ నెల 24 నుంచి యువకుడు కనిపించడకుండా పోయాడుఫోన్‌కూడా స్విచ్ఛాఫ్ వస్తోందని తండ్రి నాగరాజు చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా చిల్లకల్లు పోలీసులు సంతోష్‌కుమార్ మృతదేహాన్ని ఈ నెల 25న గుర్తించారు. సంతోష్ కుమార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేశారని, మరికొందరు ఇది ఆత్మహత్య అయి ఉంటుందని అంటున్నారు. ఇంకా పోలీసు కేసు నమోదు కాలేదు. సంతోష్‌కుమార్ తల్లిదండ్రులు మాత్రం ఎలాంటి అనుమానం వ్యక్తం చేయలేదని పోలీసులు వ్యక్తం చేశారు.


సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి దుర్గేష్‌లకు సమస్యలను వివరిస్తున్న స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి, సభ్యులు

పాత హోటల్స్‌కు ఇండస్ట్రీ స్టేటస్ ఇవ్వాలి

● ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ వినతి

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న హోటల్స్‌కే కాకుండా పాత హోటల్స్‌కు కూడా ఇండస్ట్రీ స్టేటస్ (కరెంట్, వాటర్, ప్రాపర్టీ ట్యాక్స్) లబ్ధి చేకూర్చాలని ఏపీ స్టార్ హోటల్స్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి ప్రభుత్వాన్ని కోరారు. టూరిజం కాంక్లేవ్ టెక్ ఏఐ 2.0లో భాగంగా ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ సభ్యులు, సలహాదారులు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యాటక రంగ అభివృద్ధి, విధానాల అమలుపై తమ సూచనలను వివరించారు. ఆర్.వి.స్వామి మాట్లాడుతూ, పెట్టుబడి సబ్సిడీలు పాత హోటల్స్‌కు కూడా వర్తిస్తే తమకు కూడా మేలు జరుగుతుందన్నారు. తమ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఏపీ స్టార్ హోటల్స్ ప్రధాన కార్యదర్శి ఎస్.మూర్తి చిట్టూరి, నోవోటెల్ వరుణ్ గ్రూపు ప్రతినిధి ప్రభు కిషోర్, లెమన్ ట్రీ ప్రీమియర్ చైర్మన్ గోకరాజు గంగరాజు, తాజ్ వివంతా ఎండీ రాజయ్య, ఫార్చ్యూన్ మురళీ పార్క్ ఎండీ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

పేదల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయడం ద్వారానే జగన్‌కు అడ్డుకట్ట : వడ్డే



గాంధీనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జగన్ మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని, ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని సీఎం చంద్రబాబు పారిశ్రామికవేత్తలకు పిలుపునివ్వడాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు స్వాగతించారు. పేద ప్రజలు, రైతులు, కౌలు రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసినప్పుడు మాత్రమే అరాచకవాది జగన్ మరలా అధికారంలోకి వచ్చే అవకాశం ఉండదన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసైన్డ్ భూములు కలిగిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యల తీసుకోవాలన్నారు. టిడ్కో ఇళ్లను అర్హులైన వారికి అందజేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రత్యేక చట్టాన్ని తేవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన విధంగా రైతు రుణమాఫీ చేయాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత బొగ్గు, ఐరన్ గనులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కూటమి ప్రభుత్వాన్ని వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

గాంధీనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (ఏపీఎంఎల్‌పి) రాష్ట్ర కార్యదర్శి సందీప్‌కుమార్ బిర్రు విజ్ఞప్తి చేశారు. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సమ్మె తర్వాత సమస్యల పరిష్కారానికి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రితో సమావేశం ఏర్పాటు చేయిస్తానన్న హామీని నెరవేర్చాలని కోరారు. సమ్మె కాలపు వేతనం చెల్లింపు తదితర సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కమీషనర్ సానుకూలం గా స్పందించారని సందీప్‌కుమార్ తెలిపారు. సంఘం స్టేట్ కో-ఆర్డినేటర్ వినోద్, వర్షిణీ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.


కిసాన్ మేళాలో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పశుపోషణతో రైతులు ఆదాయాన్ని పెంచుకోవాలి

గన్నవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణతో రైతులు ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కేసరపల్లి డాక్టర్ ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో శుక్రవారం తిరుపతి శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, హైదరాబాద్ జాతీయ మాంస పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కిసాన్ మేళ జరిగింది. కళాశాల అసోసియేట్ డీన్ పీవీఎస్ కిశోర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన యార్లగడ్డ మాట్లాడుతూ, అధిక పాల దిగుబడినిచ్చే మేలు జాతి పశువుల యాజమాన్యంతో ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ మాట్లాడుతూ, పశు పోషణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అన్నారు. జాతీయ మాంస పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ బాల్ బుద్దే, హైదరాబాద్ జాతీయ మాంస పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ బసవా రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ చిన్న నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం పశుసంవర్ధక రంగాన్ని అభివృద్ధి చేయడానికి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతులకు సబ్సిడీలు, రుణాలు, శిక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాలో వ్యవసాయ, అనుబంధ రంగ స్టాళ్ళను ఏర్పాటు చేశారు. శాస్త్రవేత్తలు రైతులతో చర్చా గోష్టి నిర్వహించారు. పాడి రైతులకు ఖనిజ లవణ మిశ్రమం, పశుదాణాను అందజేశారు. గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య, డాక్టర్ సి.హెచ్. వెంకట శేషయ్య, కిసాన్ మేళా సమన్వయకర్త డాక్టర్ ఆశాలత, డాక్టర్ అనిల్, 600 మంది పాడి రైతులు, వెటర్నరీ విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు

ఆర్టీసీని కాపాడుకుందాం

● స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ నేతల పిలుపు

బస్సు స్టేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ రక్షణ, ఉద్యోగ భద్రత కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో నాయకులు పిలుపు నిచ్చారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం ఫెడరేషన్ రాష్ట్ర సదస్సు జరిగింది. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు సదస్సును ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాల వల్ల ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రతకే కాకుండా సంస్థ భద్రతకు కూడా ముప్పు పొంచి ఉందన్నారు. ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరకంగా జులై 9న జరిగే జాతీయ సమ్మెలో ఆర్టీసీ సంఘాలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు ఎస్.కె.జిలానీ బాషా, రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్య, ఎస్.డబ్ల్యూఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్ప రెడ్డి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.నారాయణ, యునైటెడ్ వర్క ర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్, కుమారి, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్రా శాంసన్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు. నాయకులు కట్టా సుబ్రహ్మణ్యం, జె.దివాకర్, టీ.జీ.రవిశంకర్, కె.సీతాలక్ష్మి, తదితరులు మాట్లాడారు. అనంతరం కార్యదర్శి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఫెడరేషన్ ప్రచార కార్యదర్శి టిపిఆర్ దొర సభకు అతిథులను ఆహ్వానించగా, రాష్ట్ర కార్యదర్శి వి.శివకుమార్ వందన సమర్పణ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ రావత్‌కు ఎన్ఎంయూ వినతి



బస్సు స్టేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజా రవాణాసంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఏపీ శాఖ ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్ కుమార్ శుక్రవారం సాధారణ పరిపాలనా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రావత్‌ను సచివాలయంలో కలిశారు. పలు అంశాలను రావత్ దృష్టికి తీసుకువచ్చారు. తమ పరిధిలోని అంశాలను త్వరగా పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని రావత్ తెలియజేశారు.

గ్రామ సచివాలయ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

ధర్నాచౌక్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గ్రామ సచివాలయ సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయ సర్వేయర్లు స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన మూడు రోజుల రిలే నిరహార దీక్ష శక్రవారం ముగిసింది. ఈ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపిన సూర్యనారాయణ మాట్లాడుతూ సర్వేయర్లకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రేషనలైజేషన్‌పై సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముదుబాబు, పలువురు సంఘం ప్రతినిధులు, రాష్ట్రవ్యాప్తంగా సర్వేయర్లు పాల్గొన్నారు.


టీడీపీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో జన్మదిన కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా


కుమారుడిని ఆశీర్వదిస్తున్న వర్ల రామయ్య

ప్రజల ప్రేమను ఎప్పటికీ మరువలేను : ఎమ్మెల్యే వర్ల

పామర్రు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజల ప్రేమ, ఆదరణ ఎప్పటికీ మరువలేనని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఆయన జన్మదిన వేడుకలను శుక్రవారం పాలశీతల కేంద్రం, జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కుమార్‌రాజా కేకును కట్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

కుమార్ రాజా మాట్లాడుతూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామాల్లో సమస్యలను ప్రభు త్వ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి ఆదర్శవంతగా తీర్చిదిద్దుతానన్నారు. తొలుత మచిలీపట్నం - విజయవాడ రహదారిలోని ఇంటి నుంచి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ నేతృత్వంలో భారీ ర్యాలీగా బయలుదేరి జన్మదిన వేడుక ప్రాంగణానికి చేరుకున్నారు.

అభిమానులు, కూటమి నేతలు, కార్యకర్తలు, అధికారులు ఎమ్మెల్యే కుమార్‌రాజా, విశ్రమ దంపతులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కుమార్‌రాజా దంపతులను గజమాలతో ఘనంగా సత్కరించారు.

మరింత ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రజలు దీవించాలి : వర్ల రామయ్య

ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా భవిష్యత్తులో రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి అధిరోహించేలా ప్రజలు దీవించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. పాలశీతల కేంద్రంలో జరిగిన జన్మదిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా రామయ్య దంపతులు పాల్గొన్నారు. తనయుడు కుమార్‌రాజాకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు.


శాప్ డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు

క్రీడల అభివృద్ధే లక్ష్యం : మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

లబ్బీపేట, జూన్27(ఆంధ్రజ్యోతి) : ఏపీలో క్రీడల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం శాప్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మా ట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దానిలో భాగంగా అమరావతి వేదికగా 2500 ఎకరాల్లో అద్భుతమైన స్పోర్ట్స్ సిటీని నిర్మించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, నూతనంగా నియమితులైన డైరెక్టర్లు కీడ్రలను అభివృద్ధి చేసేందుకు పూర్తి స్థాయిలో సహకరించాలని అన్నారు. రాష్ట్రంలో ప్రతి పాఠశాలలో ఆటలు ఆడేందుకు వసతులు కల్పించేలా మంత్రి నారా లోకేశ్ ప్రణాళిక రూపొందించారని, త్వరలో శాప్ ఆధ్వర్యంలో విజయవాడలో ఫెస్ట్ నిర్వహించనున్నారని అన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, రాష్ట్ర గ్రంధాలయ సంస్థ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

సెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

1, 2 తేదీల్లో సింగలూరులో కట్టుడు పళ్ల వైద్య శిబిరం

గుడ్లవల్లేరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చంద్రాల పంచాయతీ పరిధి సింగలూరు గ్రామంలో జూలై 1, 2 తేదీల్లో ఉచిత కట్టుడు పళ్ల వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని శిబిర నిర్వాహకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ తెలిపారు. భాగ్యవిదాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటూరు సిబార్ దంత వైద్య కళాశాల రజతోత్సవ వేడుకల్లో భాగంగా శిబిరం నిర్వహిస్తున్నామని అత్యంత ఖరీదైన ఈ వైద్యం ఉచితంగా ఈ రెండు రోజులు గ్రామంలోని బండారు బ్రహ్మారావు, సీతామహాలక్ష్మి మెమోరియల్ కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. 98496 74267 కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.



మార్కెట్ యార్డు గోడౌన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

రైతు ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనాలకు కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం మార్కెట్‌యార్డులో గోడౌన్లు, షెడ్లు, యార్డు ప్రాంగణాన్ని వ్యవసాయ శాఖ, మార్కెట్ యార్డు అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. యార్డులో అధిక సంఖ్యలో గోడౌన్లు, షెడ్లు ఖాళీగా ఉన్నాయని గుర్తించారు. భూసార పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి, ఆధునిక యంత్ర సామగ్రి పనితీరును పరిశీలించారు. రైతుల ప్రయోజనాలు, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా నియోజకవర్గంలోని రెండు మార్కెట్ యార్డులు పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. యార్డు ప్రాంగణంలో ఖాళీగా ఉన్న స్థలంలో రైతు బజారు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. నిరుపయోగంగా ఉన్న గోడౌన్లు, షెడ్లు ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి, డైరెక్టర్ రషీద్‌బేగ్, యార్డు కార్యదర్శి బి.సౌజన్య, ఏడీఎం నిత్యానందం, వ్యవసాయ శాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, కడియాల గణేష్, మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

చినగొన్నూరు సమస్యలు పరిష్కరించండి

గుడ్లవల్లేరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చినగొన్నూరు గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రామును శుక్రవారం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్‌పర్సన్ శాయిన పుష్పావతి, నీటి సంఘం అధ్యక్షుడు శాయిన ప్రసాద్ కోరారు. పంచాయతీ పరిధిలో వర్షాల వల్ల గ్రామంలోని అంతర్గత రహదారులు ముంపుబారిన పడుతున్నాయని, డ్రెయిన్లన్నీ పూడిపోయి ఉన్నాయని పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని వారు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిధులు, ఎమ్మెల్యే ఫండ్స్ రావాలని చెబుతున్నారనీ పంచాయతీకి వచ్చే ఆర్థిక సంఘనిధులను గ్రామంలో పనులకు వినియోగించడం లేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జేమ్సుపేట నుంచి చినగొన్నూరు వరకు ఉన్న ఆర్ అండ్ బీ రహదారి దుస్థితినీ వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

గృహ నిర్మాణ డీఈఈగా రమేష్‌బాబు

గుడివాడ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గుడివాడ సబ్ డివిజన్ గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ)గా వి.రమేష్ బాబు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రామును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్ప కాలను అందజేశారు.

వర్ల కుమార్ రాజా పుట్టినరోజు వేడుకలు

పెదపారుపూడి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పుట్టినరోజు వేడుకలను వింజనంపాడు, భూషణగుళ్ల, పెదపారుపూడిలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు నాగనబోయిన గాంధీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేశారు. పునుకొల్లు బెనర్జీ, పునుకొల్లు భాను, నత్తా వాణి, నాగనబోయిన విజయ్, శాయల వాసు, గడ్డి శ్రీను, చెరుకూరి మల్లికార్జునరావు, చాపరాల సాంబులు, యెనిగళ్ల వెంకటేశ్వరరావు, మేడేపల్లి రత్తయ్య, శ్రీను, కొమ్మ నారాయణ స్వామి పాల్గొన్నారు.

చాగంటిపాడులో..

తోట్లవల్లూరు: చాగంటిపాడు దళితవాడలో శుక్రవారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా జన్మదిన వేడుకలను నిర్వహించారు. మట్టా అమృతబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. తోట్లవల్లూరు లయన్స్ క్లబ్‌లో ఎమ్మెల్యే కుమార్ రాజా జన్మదినోత్సవం సందర్భంగా టీడీపీ నేతలు పేదలకు అన్నదానం చేశారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

పెదపారుపూడి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని అధికారులకు ఎంపీపీ గోగం సురేష్ సూచించారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎంపీడీవో విమాదేవి మండల అధికారులను పరిచయం చేసుకున్నారు. ముంపునకు గురైన వింజనంపాడు గ్రామంలో ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్న వారికి సహాయం అందలేదని ఎంపీపీ తెలిపారు. పాములపాడు సర్పంచ్ ప్రత్తిపాటి అశ్వర్థన్ మాట్లాడుతూ పీఆర్ ఏఈ రోడ్ల నిర్మాణం కార్యక్రమానికి సర్పంచ్‌ను పిలువలేదని తెలిపారు. వైస్ ఎంపీపీలు పొనుగుమాటి రజని, వెలగల పద్మ, ఎంపీటీసీ వేమూరి మోహన్, సర్పంచ్ పాతూరి రమేష్, డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, వంశీ, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తోట్లవల్లూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు దళితవాడకు చెందిన బంద్రపల్లి సిద్ధూ కుమార్తె తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తమై రొయ్యూరుకు చెందిన టీడీపీ నేత ఉప్పులూరి గోపాలకృష్ణ శుక్రవారం రూ.5,116 అందించారు. లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగురైతు మండల అధ్యక్షుడు నెక్కలపూడి మురళీ, పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వానంగా ఐలూరు రోడ్డు

(ఆంధ్రజ్యోతి-పమిడిముక్కల): కృష్ణాపురం- ఐలూరు ఆర్ అండ్ బీ రోడ్డు గుంతలమయంగా ఉంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. రోడ్డుపొడవునా పెద్ద గుంతలు ఏర్పడడంతో కనీసం ద్విచక్రవాహనాలు వెళ్లేందుకూ వీలు లేకుండా ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పుణ్యక్షేత్రమైన ఐలూరుకు ఇతర మండలాల నుంచి ప్రజలు రోజూ వెళుతుంటారు. గుంతలమయంగా ఉన్న రోడ్డుపైన వాహనాలపై వెళుతుంటే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. వర్షం కురిసినప్పుడు లారీలు, పెద్ద వాహనాలు గుంతల్లో దిగిపోతున్నాయి. వాటిని జేసీబీల సాయంతో బయటకు తీయించుకోవాల్సి వస్తోంది. శుక్రవారం కృష్ణాపురం-ఐలూరు రోడ్డు గుంతల్లో లారీ దిగిపోయింది. జేసీబీ సాయంతో దానిని బయటకు లాగారు. రోడ్డు అభివృద్ధి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రజలు కోరుతున్నారు.



కృష్ణాపురం-ఐలూరు రోడ్డుపై శుక్రవారం గుంతల్లో దిగిపోయిన లారీని బయటకు తీస్తున్న యంత్రం



పరుపులు పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు, కార్యవర్గం

గురుకుల పాఠశాలకు 100 పరుపులు అందజేత

గుడివాడ రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దేశంలో పోలియో నివారణ కోసం రోటరీక్లబ్ ద్వారా రూ.45 వేల కోట్లు ఇప్పటివరకు ఖర్చు చేసిందని గుడివాడ రోటరీక్లబ్ అధ్యక్షుడు వి.ఎస్.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మోటూరు గురుకుల పాఠశాలలో వందమంది బాలికలకు లక్షా 30 వేల రూపాయల విలువైన 100 పరుపులను అందజేశారు. రోటరీక్లబ్ డిస్ట్రిక్ గ్రాంటు నుంచి గుడివాడ క్లబ్ ద్వారా గురుకుల పాఠశాల బాలికలకు ఉచితంగా పంపిణీ చేశామని ఆయన తెలిపారు. క్లబ్ కార్యదర్శి కిరణ్‌బాబు మాట్లాడుతూ గురుకుల పాఠశాల విద్యార్థులు చక్కగా చదువుకోవటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంజీవని దేవి, క్లబ్ కార్యదర్శి జి.కిరణ్ బాబు, ప్రెసిడెంట్ ఎలక్ట్ వై.నాగేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, వై.రెడ్డియ్య చౌదరి, ఎం.రమణమూర్తి, కార్యవర్గ సభ్యులు ఏజే ప్రసాద్, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

● ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు పిలుపు

కూచిపూడి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గన్నవరంలో సీపీఐ ఆధ్వర్యంలో జూలై 8, 9 తేదీల్లో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కూచిపూడి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ నాలుగో మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయటానికి ప్రజా సంఘాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ పేదలను పట్టించుకోవటం లేదన్నారు. ప్రజా సమస్యలపై దృష్టిసారించటం లేదన్నారు. నియోజకవర్గ, జిల్లా పార్టీ నేతలు కామ్రేడ్ పరుచూరి అజయ్‌కుమార్, చెరకు శ్రీనివాసరావు, కోదాటి నారాయణరావు, గొట్టిపాటి నాగేశ్వరరావు, కేవీ అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు

1,200 మందికి అన్నదానం

గుడివాడ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గౌరీశంకరస్వామి దేవస్థాన ఉపాలయమైన షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం 1200 మందికి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో కె.వి.గోపాలరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

దేశవ్యాప్త సమ్మెకు మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ మద్దతు

గుడివాడ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9వ తేదీన చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ పూర్తి మద్దతునిస్తున్నట్లు నాయకులు ధనాల సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావుకు సమ్మె నోటీసును అందించారు. నాయకులు ముత్యాల ఏడుకొండలు, సోమేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావుకు నోటీసు అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు

నట్టల నివారణ మందు పంపిణీ

గుడివాడ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బొమ్ములూరు పశువైద్య కేంద్రంలో మేకలకు, గొర్రెలకు శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళి, బొమ్ములూరు పశు వైద్యాధికారి వేణు నట్టల నివారణ మందు వేశారు. బొమ్ములూరు, రామన్నపూడి, బిళ్లపాడు గ్రామాల్లోని జీవాలకు సిబ్బంది నట్టల నివారణ మందులు వేశారు. శౌంరి నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బొమ్ములూరులో గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి వేణు, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు పట్టణంలోని మందపాడు, సత్యనారాయణపురం, మేదర్ బజారు, గుడ్‌మెన్‌పేట, మున్సిపల్ కార్యాలయం, భాస్కర్ థియేటర్, కోతిబొమ్మ సెంటర్, నలంద హైస్కూల్ రోడ్డు, ఎన్టీఆర్ స్టేడియం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పట్టుదలతో శ్రమిస్తే విజయాలు సొంతం

గుడ్లవల్లేరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని పెట్టుకుని, పట్టుదలతో శ్రమిస్తే జీవితంలో విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదుగుతారని విద్యార్థులకు కృష్ణా జిల్లా మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ సూచించారు. శుక్రవారం ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం 37వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. అడుసుమిల్లి అశ్వర్థనారాయణమూర్తి, వల్లూరుపల్లి వెంకట రామశేషాద్రిరావు ఆశయాల సాధన దిశగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయడం అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కొడాలి వెంకటకృష్ణారావు, పాఠశాల డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, ప్రిన్సిపాల్ వి.ఎం.కుంజుమన్, వైస్ ప్రిన్సిపాల్ జి.సత్యబాబు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, కొడాలి కృష్ణారావు

మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

పమిడిముక్కల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభయాన్ శిక్షణలో భాగంగా మండల పరిధిలో మహిళా సర్పంచ్‌లకు ఈనెల 30 నుంచి జూలై 2 వరకు ఉయ్యూరు మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వి.సీతారామరాజు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించే తరగతులకు మహిళా సర్పంచ్‌లు హాజరు కావాలని ఆయన సూచించారు.

విద్యార్థినులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్లు అందజేత

గుడివాడ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఏకేటీపీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థినులకు క్రమశిక్షణపై శుక్రవారం కమాండర్ కల్నల్ బలేందర్ సింగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. నూతనంగా ఎన్‌సీసీ విభాగంలో చేరిన విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.ప్రమీలరాణి, పాఠశాల అసోసియేట్ ఎన్‌సీసీ 2వ అధికారి కె.అనురాధ, జేసీవో కుందన్, హవాల్దార్ రమణారెడ్డి, జీసీఐ స్వరూప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ సర్టిఫికెట్లతో విద్యార్థినులు

మొవ్వ ఎండీవోగా సుహాసిని బాధ్యతల స్వీకరణ

కూచిపూడి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మొవ్వ ఎండీవోగా డి.సుహాసిని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుంచి బదిలీపై ఆమె మొవ్వ విచ్చేశారు. ఇప్పటి వరకు పని చేసిన జె.విమాదేవి పెదపారుపూడి మండలానికి బదిలీ అయ్యారు. వివిధ శాఖల అధికారులు, మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సుహాసినికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



సుబ్బారాయుడికి వెండి నాగపడగ బహూకరణ

మోపిదేవి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి దర్శికి చెందిన యార్రాశ్రీ శ్రీకాంత్‌రెడ్డి- చంద్రిక కుటుంబ సభ్యులు వెండి నాగపడగను బహూకరించారు. శుక్రవారం కుటుంబసభ్యులంతా స్వామి ని దర్శించుకున్నాక 550 గ్రాముల బరువు గల రూ.60 వేల విలువైన నాగపడగను ఆలయ పర్యవేక్షకుడు బి.సత్యనారాయణకు అందజేశారు.



వెండి నాగపడగను ఆలయ పర్యవేక్షకుడు సత్యనారాయణకు అందిస్తున్న దాతలు

మొబైల్ క్యాన్సర్ పరీక్షలు

గుడివాడ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొబైల్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మోటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి దీప్తి తెలిపారు. బిళ్లపాడు సబ్ సెంటర్‌లో మొబైల్ వ్యాన్ ద్వారా శుక్రవారం ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది, బిళ్లపాడు గ్రామస్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

గుడివాడ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ఐటీఐ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ ఎస్సై నాగరాజు సూచించారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మత్తు పదార్థాలు, కాల్‌మనీ వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ నేరమని తెలిపారు. హెల్మెట్ పెట్టుకుని మాత్రమే వాహనాల నడపాలని సూచించారు. ఏఎస్ఐ రత్నరాజు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

నెట్టెం రఘురామ్‌కు సత్కారం



నెట్టెం రఘురాంను సత్కరిస్తున్న గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాంను శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. రైతుల కష్టసుఖాలు తనకు తెలుసని, స్వల్పకాలిక రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు అందించడంపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని పీఏసీఎస్‌లన్నీ కంప్యూటరీకరణ చేయిస్తున్నామన్నారు.



గూడూరు సీహెచ్‌సీలో ఎక్స్‌రే యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, పోతన స్వామి

రోగులకు మెరుగైన సేవలందించండి

● వైద్యసిబ్బందికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచన

గూడూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని వైద్యులకు, సిబ్బందికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. శుక్రవారం గూడూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే, సీఆర్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ పోతన స్వామి, నాయకులు దుర్గారావు, బి.స్వామి, గోపీ నాగబాబు, పోతన రామోజీ, ఎన్‌ఏ బేగ్, బాసంశెట్టి శ్రీనివాసరావు, తోట వేణు, ఆస్పత్రి అధికారులు శేషకుమార్, నరేంద్ర పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

బంటుమిల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం అర్తమూరులో సంత మార్కెట్ పక్కన గల ఆక్విన్ కాలువ డ్రెయిన్ పనులను ఆయన ప్రారంభించారు. చెత్తాచెదారం, గుర్రపుడెక్కతో డ్రెయిన్ నిండిపోయి రైతులు ఇబ్బంది పడుతుండడంతో పూడిక పనులు ప్రారంభించారు.



కలెక్టర్ బాలాజీని సత్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ యోగసభ సభ్యులు

కలెక్టర్ బాలాజీకి సత్కారం

మచిలీపట్నం టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించి సీఎం చంద్రబాబు నుంచి కలెక్టర్ బాలాజీ ప్రశంసలందుకోవడం గర్వకారణమని యోగా గురువులు ఘంటసాల గురునాథబాబు, మద్దాల చింతయ్య అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ఉదయపు నడక మిత్ర మండలి హాలులో కలెక్టర్ బాలాజీని యోగసాధకులు సత్కరించారు. యోగసాధకులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

మచిలీపట్నం టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): యూని ఫాం, బెల్టులు, బూట్లు, పుస్తకాలు అమ్ముతూ విద్యార్థులను దోపిడీ చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈవో కార్యాలయం వద్ద ఏఐఎస్‌ఎఫ్, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ బాలాజీకి వినతిపత్ర మిచ్చారు. సాయికుమార్, న్యాయవాది అరవిందకుమార్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



నిరాహార దీక్ష చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

మచిలీపట్నం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు అమలు చేయాలంటూ శుక్రవారం బందరు మండలం రుద్రవరం పాఠశాలలు, గురుకుల కళాశాలల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు నిరాహార దీక్షలు చేపట్టారు. సీఐటీయూ నాయకులు బి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రేమ్ సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు దీక్షలో కూర్చున్నారు. 2019 నుంచి గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం చెల్లించడం లేదని, ఈపీఎఫ్, ఈఎస్‌ఐలను ఏజెన్సీలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వారాంతపు సెలవులు ఇవ్వాలని సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. జయరావు, సెక్యూరిటీ గార్డుల ఉద్యోగుల సంఘ నాయకులు రవికుమార్, అరుణకుమార్, మురళి పాల్గొన్నారు.

పాండు మాస్టారు కన్నుమూత

చల్లపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంపాటు మండల అక్షరాస్యతా అధికారిగా పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు కె.సి.పాండు మాస్టారు(70) గురువారం రాత్రి అనారోగ్యంతో రామానగరం దళితవాడలోని స్వగృహంలో కన్నుమూశారు. చైతన్యపరిచే సందేశాత్మక నాటకాలు, కళారూపాల ప్రదర్శనల గ్రామీణ పేదల్లో అక్షరాసత్యకు ఎంఎల్‌వోగా ఆయన కృషిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పాండు మాస్టారి భౌతికకాయాన్ని శుక్రవారం ఉదయం పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, నేతలు సందర్శించి నివాళులర్పించారు.

వేముల హేమంత్‌కు అభినందన



హేమంత్‌ను అభినందిస్తున్న వైస్ ఎంపీపీ రాంబాబు, ఉపసర్పంచ్ నాని

చల్లపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సీఎంఏలో జాతీయ స్థాయిలో 36వ ర్యాంకు సాధించి న్యూఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన 12వ నేషనల్ స్టూడెంట్స్ కాన్వకేషన్లో పతకం, సర్టిఫికెట్ స్వీకరించి, చల్లపల్లికి వచ్చిన గ్రామానికి చెందిన వ్యాపారవేత్త షణ్ముఖ పాండురంగారావు..దీపికల కుమారుడు హేమంత్‌ను పలువురు ప్రముఖులు సత్కరించారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, టీడీపీ నేతలు గువ్వాబత్తిన నాగేశ్వరరావు, వేముల హరికృష్ణ, జన్ను నాంచారయ్య, డీసీ చైర్మన్ అయిన పూడి భానుప్రకాష్, మెండు కొండలు, దోనేపూడి గోపీకృష్ణ తదితరులు అభినందించారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

మచిలీపట్నం టౌన్/నాగాయలంక, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధి విదియ సందర్భంగా ఒడిశాలో నిర్వహించే శ్రీపూరి జగన్నాథ రథయాత్రను శుక్రవారం మచిలీపట్నం, నాగాయలంకలో వైభవంగా నిర్వహించారు. బందరు జగన్నాథపురంలోని సుభద్ర బలరామ సమేత జగన్నాథస్వామి దేవాలయం నుంచి శుక్రవారం రాత్రి జగన్నాథ రథయాత్ర ప్రారంభమైంది. పురవీధుల్లో భక్తులు భజనలు చేస్తూ యాత్ర వెంట నడిచారు. ఆలయ అర్చకుడు బృందావనం సుధీర్ ఆచార్యులు, దేవస్థానం ఈవో జి.వెంకట కృష్ణారావు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ పాల్గొన్నారు. నాగాయలంకలో జగన్నాథ రథయాత్రను స్కాలర్స్ కాన్వెంట్ యాజమాన్యం, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో పురవీధుల్లో నిర్వహించారు. సునీల్ పట్నాయక్, లింగం బసవ శంకరరావు, పూషడపు నిరంజన్‌రావు, మహిళలు పాల్గొన్నారు.





నాగాయలంక, మచిలీపట్నం పురవీధుల్లో జగన్నాథుడి రథయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



ప్లాటినం జూబ్లీ లోగోను ఆవిష్కరిస్తున్న ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ తదితరులు

ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘానికి 75 ఏళ్లు

మచిలీపట్నం టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల సంఘం ఏర్పడి జులై 1 నాటికి 75 ఏళ్లు నిండుతున్న సందర్భంగా శుక్రవారం ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ప్లాటినం జూబ్లీ లోగోను ఆవిష్కరించారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ తెలిపారు. ఏడాది పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో సంఘ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలన్నారు. సంఘ నాయకులు జె.సుధాకర్, డి.వాసు, ఎల్.రాజశేఖర్, ఎస్.వి.రత్నారావు, నాగయ్య పాల్గొన్నారు.

బాలిక మిస్సింగ్ ఛేదన

బంటుమిల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బాలిక మిస్సింగ్ కేసును బంటుమిల్లి పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయపురం గ్రామానికి చెందిన బాలిక ఈనెల 23వ తేదీన తన అమ్మమ్మ మందలించిందని గ్రామం నుంచి బంటుమిల్లికి అక్కడి నుంచి మచిలీపట్నం చేరుకుంది. ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా దర్యాప్తు చేసిన పోలీసులు మచిలీపట్నంలో శుక్రవారం బాలిక ఆచూకీ కనుగొన్నారు. ఎస్సై గణేష్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఐసీడీఎస్ అధికారులతో కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇప్పించారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె



మోదుమూడిలో యాళ్లమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు

అవనిగడ్డ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మోదుమూడిలోని యాళ్లమ్మ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు బచ్చు రఘునాథ్ ప్రసాద్ దంపతులు అమ్మవారికి చీర సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్థులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గణపేశ్వరంలో దుర్గమ్మకు..

నాగాయలంక: గణపేశ్వరంలో దుర్గా గణపేశ్వరస్వామి ఆలయంలో దుర్గమ్మకు శుక్రవారం దిండి గ్రామానికి చెందిన గ్రామస్థులు, భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు.

సుబ్బారాయుడికి వెండి నాగపడగ బహూకరణ



వెండి నాగపడగను ఆలయ పర్యవేక్షకుడు సత్యనారాయణకు అందిస్తున్న దాతలు

మోపిదేవి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి దర్శికి చెందిన యారాశ్రీ శ్రీకాంత్‌రెడ్డి- చంద్రిక కుటుంబ సభ్యులు వెండి నాగపడగను బహూకరించారు. శుక్రవారం స్వామిని దర్శించుకున్నాక 550 గ్రాముల బరువు గల రూ.60 వేల విలువైన నాగపడగను ఆలయ పర్యవేక్షకుడు బి.సత్యనారాయణకు అందజేశారు.

4వ నెంబర్ కాలువపై తూముల కల్వర్టు ఏర్పాటు



వి.కొత్తపాలెం వద్ద కాలువపై వేసిన తూములు

కోడూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వి.కొత్తపాలెం గ్రామంలో కల్వర్టు సమస్య పరిష్కారమైంది. నాలుగో నెంబర్ పంట కాలువపై గతంలో నిర్మించిన కల్వర్టు శ్లాబు ఇటీవల కూలిపోయింది. దీంతో కాలువ అవతల ఉన్న వంద ఎకరాల సాగుభూమికి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభించేందుకు తమకు ఎదురైన ఇబ్బందిని రైతులు జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంకట్రామ్ స్పందించి తూములు ఇవ్వడంతో వి.కొత్తపాలెం నీటి సంఘం అధ్యక్షుడు రేపల్లె రవీంద్ర పర్యవేక్షణలో తూములు వేసి, సాగునీటి సరఫరాకు, రైతుల రాకపోకలకు అనువుగా తాత్కాలిక మార్గం ఏర్పాటు చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా జన్మదినోత్సవం

అవనిగడ్డ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. చిట్టిబాబు కేక్ కట్ చేశారు. అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, విశ్వనాథుని మురళీమోహన్, గరికపాటి హరిబాబు, లుక్కా శ్రీనివాసరావు, బచ్చు మురళీ, చిట్టిబాబు అభిమానులు పాల్గొన్నారు.

యువత ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): యువత ర్యాగింగ్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్‌పేట సీఐ సాయిబాబు సూచించారు. ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు మోటారు వెహికల్ యాక్టు, యాంటీ ర్యాగింగ్, బాల్య వివాహాల నిషేధంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎం.మాణిక్యమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కోడూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవనిగడ్డ సీఐ యువకుమార్ అవగాహన కల్పించారు. పోక్సో, బాలికలపై లైంగిక వేధింపులు, లైగింక నేరాల నుంచి రక్షణ కల్పించే చట్టాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, ఎస్‌ఐ చాణక్య, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నవజాత శిశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● పీహెచ్‌సీ వైద్యుల శిక్షణలో డాక్టర్ హిమబిందు

మచిలీపట్నం టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించేందుకు నవజాత శిశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ హిమబిందు సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ప్రాథమిక వైద్యశాలల వైద్యులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. పుట్టుకతో వచ్చే వ్యాధులను శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను ప్రారంభంలోనే గుర్తించాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ హారిక, డాక్టర్ దీప్తి, డాక్టర్ శ్రీజ పాల్గొన్నారు.



ఐఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న మండలి వెంకట్రామ్, నేతలు

విద్యార్థినులకు సత్కారం

నాగాయలంక, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తలగడదీవి జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదివి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన మండలి పవిత్ర, పులిగడ్డ అలేఖ్యను శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ సత్కరించారు. పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన భోగాది గాయత్రి శ్రీ సహస్రను కూడా సత్కరించారు. ఎంఈవో టి.వి.ఎం.రామదాసు, భోగాది వెంకటేశ్వరరావు, వర్రే రాంబాబు, విద్యాకుటుంబం పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ టాయిలెట్ల ప్రక్షాళన

నాగాయలంక, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయం చెంతన ఓఎన్‌జీసీ యాజమాన్యం నిర్మించిన నాలుగు మరుగుదొడ్లను పంచాయతీ కార్యదర్శి జె.పవన్ కుమార్ శుక్రవారం పారిశుధ్య సిబ్బందితో ప్రక్షాళన చేయించారు. 2019లో నాలుగు మల, మూత్రశాలలను ఓఎన్‌జీసీ యాజమాన్యం నిర్మించింది. నిర్వహణ బాధ్యతలను గాలికి వదిలేసింది. దీంతో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. ఈ టాయిలెట్లు గురించి పత్రికల్లోను, సామాజిక మాధ్యమాల్లో తరచుగా కథనాలు రావడతో కార్యదర్శి స్పందించారు.

1న మండల సమావేశం

అవనిగడ్డ రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చే నెల 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ తుంగల సుమతీదేవి అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీవో మరియకుమారి శుక్రవారం తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని ఆమె సూచించారు.

జడ్పీ పాఠశాలలో వాటర్ ట్యాంకు ప్రారంభం

నాగాయలంక, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తన తల్లిదండ్రులు దివంగత పరశురామయ్య, కృష్ణవేణమ్మ జ్ఞాపకార్థం జడ్పీ పాఠశాల పీడీ కోసూరు పూర్ణచంద్రరావు అందించిన రూ.70 వేలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం అవనిగడ్డ సీఐ యువకుమార్ ప్రారంభించారు. పీడీని సీఐ అభినందించారు. ఎస్‌ఐ కె.రాజేష్, ప్రధానోపాధ్యాయుడు ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

ఘంటసాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమని తహసీల్దార్ బి.విజయప్రసాద్ పేర్కొన్నారు. దాలిపర్రు ఎస్సీ కాలనీకి చెందిన తూము ప్రసాద్‌కు చెందిన తాటాకు ఇల్లు వర్షాలకు కుప్పకూలింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాధితులకు వంట సామాగ్రి, టార్పాలిన్ అందించింది. నిత్యావసరాలను రెవెన్యూ ఉద్యోగులు అందించారు. సర్పంచ్ డొకిపర్తి శాంతకుమారి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు కొండపల్లి పిచ్చేశ్వరరావు, సాల్మన్ రాజు, వీఆర్వో వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులకు పింఛన్ పెంచాలి

కోడూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రంగస్థల కళాకారులకు ప్రభుత్వం అందించే పింఛన్ నగదు పెంచాలని కళాకారుడు లంకే వెంకటస్వామి శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ సౌజన్య కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. వృద్ధాప్య కళాకారులకు వచ్చే రూ.4 వేలు కుటుంబ పోషణకు చాలటం లేదన్నారు. ప్రభుత్వం రూ.6 వేలకు పింఛన్ పెంచాలని కోరారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

గూడూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల పంపిణీలో భాగంగా చిట్టిగూడూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సర్పంచ్ లంకా చంద్రలీల, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ అనూష బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నవీన్‌బాబు, గొరిపర్తి శేఖర్, రాసంశెట్టి శివరావు, చిలుకోటి లక్ష్మీనారాయణ, శివాజీ, సురేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలు

జయప్రదం చేయండి

ఘంటసాల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చినకళ్లేపల్లి గ్రామంలో శనివారం నిర్వహించే అవనిగడ్డ నియోజకవర్గ సీపీఐ 25వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రాబోయే మూడేళ్లలో పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేందుకు, పేదల పక్షాన పోరాడటానికి, అధికార, ప్రతిపక్ష లోపాలు ఎత్తిచూపుతూ ప్రక్షాళన చేసే దిశగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు విచ్చేస్తారని తెలిపారు. గుత్తికొండ రామారావు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, నక్కా శ్రీనివాసరావు, సిద్దాబత్తుల హేమార్జున, దాసరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.